ANN తెలుగు

Follow: @ANNTELUGU

11-11-2024

# మహా పత్రిక

సోమవారం, హైదరాబాద్ సంపుటి- 23 సంచిక- 300 పేజీలు-08 వెల-రూ.6

PUBLISHED FROM HYDERABAD | TIRUPATI REGISTERED NUMBER: APTEL/2003/9316 WWW.EPAPER.MAHAADAILY.COM

## ఐక్యంగా ఉంటేనే సురక్షితం

### ఓబీసీలలో కాంగ్రెస్ చిచ్చు

**ఝార్ఖండ్ ప్రచారంలో ప్రధాని నరేంద్ర మోడీ**

మహా, రాంచీ : కాంగ్రెస్ -జేఎమ్ఎమ్ కూటమి ఓబీసీలను ఒకరిపైకి ఒకరిని ఉసిగొల్పుతోందని ప్రధాని నరేంద్ర మోడీ ఆరోపించారు. ఐక్యంగా ఉంటేనే సురక్షితంగా ఉంటామని హెచ్చరించారు. ఈ మేరకు ఆదివారం ఝార్ఖండ్లోని బొకారోలో జరిగిన ఎన్నికల ర్యాలీలో ప్రధాని మోడీ ప్రసంగించారు. చోటానాగ్పూర్ ప్రాంతంలో 125పైగా ఉపకులాలను ఓబీసీలుగా పరిగణిస్తున్నారు. వారిని ఒకరిపైకి మరొకరిని ఉసిగొల్పి కాంగ్రెస్-జేఎమ్ఎమ్ వారి ఐక్యతను విచ్ఛిన్నం చేయాలని చూస్తున్నాయి. అందుకే ఐక్యంగా ఉంటేనే సురక్షితంగా ఉంటామని హెచ్చరిస్తున్నాను అని మోడీ అన్నారు.



## పొంగులేటి బాంబుల శాఖ మంత్రి

- మాజీ మంత్రి కేటీఆర్ విసుర్లు
- ఈ బాంబు పేలుతుంది...
  ఆ బాంబు పేలుతుందంటున్నారని కేటీఆర్ ఎద్దేవా

02



## పదవులను బాధ్యతగా భావించాలి

- ప్రజల కోసం పని చేయాలి
- పోరాటం, కష్టం, త్యాగం, పనితీరు, విధేయత, క్రమశిక్షణ ఆధారంగానే పదవులు
- నామినేటెడ్ పదవులు పొందిన వారికి ఏపీ సీఎం చంద్రబాబు సూచన



## ధరణి దందా

- రూ. 60వేల కోట్ల స్కామ్
- ప్రభుత్వ భూములన్నీ స్వాహా!
- ప్రైవేటు వ్యక్తులకు ధారాదత్తం
- గత ప్రభుత్వంలో భూములన్నీ అన్యాక్రాంతం
- విచారణ జరపాలని రిటైర్డ్ రెవెన్యూ ఉద్యోగుల సంఘం లేఖ






## హైదరాబాద్‌లో భారీ పేలుడు

మహా, హైదరాబాద్: హైదరాబాద్‌లో ఆదివారం ఉదయం భారీ పేలుడు అలజడి సృష్టించింది. జూబ్లీహిల్స్ రోడ్డు నెంబరు వన్‌లో ఈ పేలుడు సంభవించింది. తెలంగాణ స్పైసీ కిచెన్ రెస్టారెంట్‌లో ఈ ప్రమాదం జరిగింది. పేలుడు ధాటికి సమీప బస్తీలోని రాళ్లు ఎగిరిపడ్డాయి. దీంతో బస్తీలోని ఇళ్లలో వంటసామాగ్రి చెల్లాచెదురయ్యాయి. ఈ ఘటనలో ఓ బాలికకు గాయాలైనట్లు తెలుస్తోంది. సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. గ్యాస్ సిలిండర్ పేలినట్లు పోలీసులు భావిస్తున్నారు. ఉదయాన్నే ప్రమాదం చోటుచేసుకోవడంతో ఆ ప్రాంతంలో భయాందోళన నెలకొంది.



## ట్రంప్‌కు పార్టీ ఇవ్వనున్న బైడెన్

మహా, న్యూయార్క్: అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో గెలుపొందిన డొనాల్డ్ ట్రంప్, ప్రస్తుత యూఎస్ ప్రెసిడెంట్ జో బైడెన్ బుధవారం ఓవల్ కార్యాలయంలో సమావేశం కానున్నారు. ఈ విషయాన్ని స్వయంగా శ్వేతసౌధం వర్గాలు తెలిపాయి. అమెరికాలో ప్రెసిడెన్సియల్ ఎలక్షన్స్ పూర్తయిన తరువాత ప్రస్తుత అధ్యక్షుడు, త్వరలో ప్రమాణం చేయనున్న అధ్యక్షుడికి ఆతిథ్యం ఇవ్వడం సంప్రదాయంగా వస్తోంది. అందులో భాగంగానే జో బైడెన్, ట్రంప్‌కు ఆతిథ్యం ఇవ్వనున్నారు.



మహా ఎక్స్‌క్లూజివ్

## 2027 ఫిబ్రవరిలో.. జమిలి ఎన్నికలు

### ఢిల్లీ పొలిటికల్ సర్కిల్స్‌లో చర్చ

- ఉత్తరప్రదేశ్ అసెంబ్లీతో కలిపి నిర్వహించే వ్యూహం
- సమాచారం ఉందంటున్న కీలక నేతలు
- లోక్ సభ, అసెంబ్లీలకు ఒకేసారి ఎన్నికలు
- తెలంగాణలో 153కు పెరగనున్న అసెంబ్లీ నియోజకవర్గాలు
- అంత ఈజీ కాదంటున్న నిపుణులు
- మోడీ పట్టుతో సాధ్యమేనంటున్న కమలనాథులు
- నవంబర్ 25 నుండి పార్లమెంట్ సమావేశాలు.. ఈ సమావేశాల్లోనే బిల్లు

దేశంలో జమిలి ఎన్నికలపై ప్రధాని నరేంద్రమోడీ పట్టుదలగా ఉన్నారు. జమిలికి సంబంధించి సర్వం సిద్ధమవుతోంది. నియోజకవర్గాలు, షెడ్యూల్ పై కూడా కేంద్ర ప్రభుత్వ ఉన్నతస్థాయి వర్గాలు రోడ్ మ్యాప్ ఖరారు చేశాయని ఢిల్లీ పొలిటికల్ సర్కిల్స్ లో వినబడుతోంది. అన్నీ అనుకున్నట్లు జరిగితే 2027 ఫిబ్రవరిలోనే దేశవ్యాప్తంగా జమిలి ఎన్నికలు జరగనున్నాయి. అంతర్గత కసరత్తు మాత్రం తీవ్రంగానే జరుగుతోంది.. జమిలి ఖాయం అంటూ పిఎంవో వర్గాలు కూడా చెబుతున్నాయి. జమిలి ఎన్నికలు జరిగితే దేశ రాజకీయాల్లో విప్లవాత్మక మార్పులు రానుండగా, అనేకమంది నేతలు కనుమరుగుకానున్నారు.

- ఢిల్లీ ప్రత్యేక ప్రతినిధి, మహా

మిగతా 2లో



### బంగారం ధరలు

| | |
|---|---|
| 24 క్యారెట్ | 79,360 |
| 22 క్యారెట్ | 72,750 |
| సిల్వర్ (కేజీ) | 94,000 |

### స్టాక్ మార్కెట్

| | |
|---|---|
| సెన్సెక్స్ ↗ | 79,486.32 |
| నిఫ్టీ ↗ | 24,148.20 |

### ఈరోజు చికెన్ ధరలు

| | చికెన్ | స్కిన్ లెస్ | బోన్ లెస్ |
|---|---|---|---|
| 1 కేజీ రిటైల్ ధర ₹ | 160 | 200 | 210 |
| హోల్ సేల్ ధర ₹ | 160 | 200 | 210 |

### ఈరోజు గుడ్డు ధరలు

| | 1 పీస్ | ట్రే |
|---|---|---|
| ఎన్ఈసీసీ గుడ్డు ధర ₹ | 5.55 | 166.5 |
| హోల్ సేల్ గుడ్డు ధర ₹ | 5.55 | 166.5 |
| రిటైల్ గుడ్డు ధర ₹ | 5.88 | 176.49 |



## ఎవరెన్ని కుట్రలు చేసినా పాలమూరు గడ్డ రుణం తీర్చుకుంటా

**ప్రాజెక్టులు పూర్తిచేయకుంటే.. చరిత్ర నన్ను క్షమించదు**

ప్రతీ నెలా పాలమూరు జిల్లా ప్రాజెక్టులపై సమీక్ష
దయచేసి మా జిల్లా అభివృద్ధిని అడ్డుకోకండి
అడ్డుకునే ప్రయత్నం చేసేవారు చరిత్ర హీనులవుతారు
నిధులు కేటాయిస్తుంటే.. కొందరు దుర్మార్గులు కళ్లల్లో నిప్పులు పోసుకుంటున్నారు
పచ్చని పైర్లతో పాలమూరు విలసిల్లాలి
కురుమూర్తి జాతరలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

**మహబూబ్ నగర్, మహా:** ఎవరెన్ని కుట్రలు చేసినా పాలమూరు బిడ్డగా పుట్టిన గడ్డ రుణం తీర్చుకుంటానని, పాలమూరు జిల్లా సాగు నీటి ప్రాజెక్టులు పూర్తి చేయాలని నిధుల కేటాయిస్తుంటే, కొంతమంది దుర్మార్గులు కళ్లల్లో నిప్పులు పోసుకుంటున్నారని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. సాగు నీటి ప్రాజెక్టులు ఆధునిక దేవాలయాలనీ, వాటిని అభివృద్ధి చేసుకోవాల్సిన సామాజిక బాధ్యత మన అందరి మీద ఉందని సీఎం అన్నారు. మహబూబ్నగర్ జిల్లాలోని శ్రీ కురుమూర్తి స్వామి దేవాలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు.

మిగతా 2లో

### చిల్లర రాజకీయాలొద్దు

ఆరు, ఏడు దశాబ్దాలుగా వెనుకబడి ఉన్న ప్రాంతంలో వలసలు ఆపాలని చేస్తున్న భగీరథ ప్రయత్నాన్ని అడ్డుకోవాలని వివిధ రకాల ఆరోపణలు చేసి చిల్లరమల్లర రాజకీయాలకు తెర లేపాలని చూస్తున్నారని మండిపడ్డారు. పాలమూరులోని దేవాలయాల అభివృద్ధితో పాటు, ప్రాజెక్టులను పూర్తి చేసి జిల్లాను పచ్చగా మారుస్తామని ప్రజలకు హామీ ఇస్తున్నాను. విద్య, వైద్యం, ఉపాధి కల్పనకు నిరంతరం కృషి చేస్తాను. మక్తల్, నారాయణపేట్, కొడంగల్ ప్రాజెక్టులను పూర్తి చేసి జిల్లాలోని ప్రతి ఎకరాకు నీరందిస్తాం. పాలమూరు అభివృద్ధిని కొందరు అడ్డుకోవాలని చూస్తున్నారు. ఎవరెన్ని కుట్రలు చేసినా అభివృద్ధి చేసి తీరుతానని, ప్రతీ నెలా జిల్లా ప్రాజెక్టులు సమీక్షిస్తానని స్పష్టం చేశారు.

## తెలంగాణ బియ్యాన్ని దిగుమతి చేసుకుంటాం

**మలేసియన్ బిజినెస్ మీట్‌లో.. మలేషియన్ దిగుమతి దారుల హామీ..**

**వ్యవసాయ అభివృద్ధి గురించి వివరించిన మంత్రి శ్రీధర్ బాబు**



**మలేషియా, మహా :** తెలంగాణ లో సాగు చేస్తున్న వరి, ధాన్యం రకాల గురించి, నాణ్యత, తదితర అంశాలను మలేషియన్ బిజినెస్ మీట్ లో రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబు కూలంకషంగా వివరించారు., రాష్ట్రంలో వ్యవసాయం పట్ల ప్రభుత్వం తీసుకున్న శ్రద్ధ, రైతులకు కల్పిస్తున్న రాయితీలు, సౌకర్యాలను కూడా వివరించారు. సాగులో అమలవుతున్న మెళుకువలు, సేంద్రీయ వ్యవసాయాన్ని రాష్ట్ర ప్రభుత్వం ప్రోత్సహిస్తున్న

మిగతా 2లో



## విద్యకు కాంగ్రెస్ ప్రభుత్వం పెద్ద పీఠ

- రేవంత్ రెడ్డి నాయకత్వంలో పాఠశాలలకు మెరుగైన సౌకర్యాలు
- ఉపాధ్యాయులకు మద్దతుగా నిలుస్తాం
- టీయూటీఎఫ్ రాష్ట్ర మహాసభలలో కంది శ్రీనివాసరెడ్డి

03

# రుణం తీర్చుకుంటా





(మొదటిపేజీ తరువాయి)

అనంతరం అక్కడే ఏర్పాటు చేసిన సభలో పాల్గొని ప్రసంగించారు. దేవాలయాలకు నిధులతో పాటు, ఆధునిక దేవాలయాలైన సాగునీటి ప్రాజెక్టులను పూర్తి చేయడం ద్వారా ఎడారిగా మారి వలసలు పోతున్న పాలమూరు జిల్లాలో పసిడి పంటలు పండాలని, పచ్చని పైరులతో ఈ జిల్లా విలసిల్లాలని ఆకాక్షించారు. అందుకు అనుగుణంగా జిల్లాలోని ప్రాజెక్టులను పూర్తి చేసేందుకు వేగంగా అడుగులు వేస్తున్నామన్నారు. అదేవిధంగా ఎత్తైన ప్రాంతమైన మక్తల్ దగ్గర కృష్ణమ్మ ప్రవహిస్తున్నా, సాగు నీరు లేకపోవడం వల్ల ఇబ్బంది పడుతుంటే మక్తల్, నారాయణపేట, కొడంగల్ సాగునీటి ప్రాజెక్టును మంజూరు చేశామని, టెండర్లు సైతం పూర్తవడంతో తొందర్లోనే పనులు ప్రారంభించబోతున్నామన్నారు. గత పాలకుల నిర్లక్ష్యం వల్ల పాలమూరుకు తీవ్ర అన్యాయం జరిగిందని ఆవేదన వ్యక్తం చేశారు. పాలమూరు బిడ్డనై ఉండి.. ప్రాజెక్టులు పూర్తి చేయకపోతే ప్రజలు తనను క్షమించరన్నారు. దయచేసి తమ జిల్లా అభివృద్ధిని అడ్డుకోకండన్నారు. పాలమూరు ప్రజలు ఓట్లు వేస్తేనే కేసీఆర్ రెండు సార్లు సీఎం అయ్యారని ఈ సందర్భంగా రేవంత్ రెడ్డి గుర్తు చేశారు. పాలమూరు యువతకు శిక్షణ ఇచ్చి ఉద్యోగాలు వచ్చేలా కృషి చేస్తామన్నారు. తమ పరిశ్రమలో 2 వేల మందికి ఉద్యోగాలు ఇస్తామని అమర్‌రాజా సంస్థ హామీ ఇచ్చిందని తెలిపారు.

**కురుమూర్తి కారిడార్ కు రూ.110కోట్లు**

కురుమూర్తిస్వామిని దర్శించుకుంటే తిరుమల వేంకటేశ్వరస్వామిని దర్శించుకున్నట్లేనని, పాలమూరు బిడ్డకు సీఎం అయ్యే అవకాశం వచ్చిందంటే అంతా ఆ స్వామి దయనే అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. ఇప్పటికీ కురుమూర్తి ఆలయంలో మౌలిక సదుపాయాలు లేవని ఆయన పేర్కొన్నారు. అందుకే రూ.110 కోట్లతో ఘాట్ రోడ్ కారిడార్ నిర్మిస్తున్నామన్నారు. కురుమూర్తి ఆలయానికి ఏం కావాలో కలెక్టర్ నివేదిక ఇస్తే నిధులు మంజూరు చేస్తామని చెప్పారు. పేదల తిరుపతిగా కురుమూర్తి ఆలయాన్ని కొలుస్తారన్నారు. గత పాలకుల నిర్లక్ష్యం వల్ల పాలమూరులో ప్రాజెక్టులు సైతం పూర్తి కాలేదన్నారు. కేసీఆర్ హయాంలో పాలమూరుకు పరిశ్రమలు, ప్రాజెక్టులు రాలేదని విమర్శించారు. పాలమూరులో ఇంకా వలసలు కొనసాగుతూనే ఉన్నాయని సీఎం రేవంత్ రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. మక్కల్, నారాయణ్ పేట్, కొడంగల్ ప్రాంతాలకు కృష్ణా జలాలు తీసుకు వస్తామని స్పష్టం చేశారు. సీఎం రేవంత్ వెంట మంత్రులు కోమటిరెడ్డి, రాజనర్సింహ తదితరులు ఉన్నారు.

## 2027 ఫిబ్రవరిలో..

# జమిలి ఎన్నికలు

**ఢిల్లీ, మహా:** నియోజకవర్గాల పునర్విభజన 2026లోనే జరగనుంది. తెలంగాణ, ఏపిలలో అసెంబ్లీ నియోజకవర్గాల పునర్విభజన ఖాయమే. తెలంగాణలో 119గా ఉన్న అసెంబ్లీ నియోజకవర్గాలు 153కు పెరగనుండగా, ఏపిలో 175గా ఉన్న అసెంబ్లీ నియోజకవర్గాలు 225గా మారనున్నాయి. కేంద్ర ప్రభుత్వం వచ్చే ఎన్నికల్లో ఒకేసారి మహిళా రిజర్వేషన్లు, లోక్‌సభ సీట్ల పెంపు, జమిలి ఎన్నికల విధానాన్ని అమలుచేసే యోచనలో ఉంది. దేశవ్యాప్తంగా ఒకేసారి పార్లమెంటుతో పాటు, రాష్ట్రాల అసెంబ్లీలకు ఎన్నికలు నిర్వహించాలంటే 6 రాజ్యాంగ సవరణలు చేయాల్సి ఉంటుంది. అందుకు సగం రాష్ట్రాల ఆమోదం కావాలి. ప్రస్తుతం లోక్‌సభ, రాజ్యసభల్లో ఎన్డీఏ ప్రభుత్వానికి ఉన్న సొంత బలం సరిపోదు. జమిలి కోసం అదనపు ఎంపీల మద్దతు కూడగట్టాల్సి ఉంటుంది. 1951 నుంచి 1967 దాకా దేశవ్యాప్తంగా జమిలి ఎన్నికలు జరిగాయి. తర్వాత వివిధ రాష్ట్రాల్లో ప్రభుత్వాలు కూలడం వల్ల మధ్యంతర ఎన్నికలొచ్చి జమిలి మాయమై ఆయా రాష్ట్రాల అసెంబ్లీల గడువులు మారాయి. ప్రస్తుత పరిస్థితుల్లో వీటన్నింటినీ రానున్న సార్వత్రిక ఎన్నికలతో కలపాలంటే కొన్ని రాష్ట్రాల అసెంబ్లీల గడువును పెంచడమో, మరికొన్నింటిని తగ్గించడమో చేయాలి. లోక్‌సభ ముందస్తు ఎన్నికలకు వెళ్లినా ఈ మార్పులు తప్పవు. ఇందుకు రాజ్యాంగ పరంగా అవరోధాలున్నాయి.

**రాష్ట్రాలు ఆమోదం అవసరం**

లోక్‌సభలో ప్రస్తుతం ఎన్డీఏకు 293 ఎంపీల బలముంది. జమిలి ఆమోదానికి 362 మంది ఎంపీల మద్దతు అవసరం ఉంటుంది. రాజ్యసభలో ఎన్డీఏకు బలం 121 కాగా జమిలి ఆమోదానికి 164 మంది ఎంపీల మద్దతు కావాల్సి ఉంది. పార్లమెంటరీ ప్రజాస్వామ్యమే కాకుండా సమాఖ్య వ్యవస్థ కలిగిన దేశం కావడం వల్ల రాష్ట్ర ప్రభుత్వాల మాటకూ విలువ ఉంటుంది. పార్లమెంటుతో పాటు దేశంలోని సగం రాష్ట్రాల అసెంబ్లీలు ఇందుకు అంగీకరించాలి. అంటే 14 రాష్ట్రాలకు పైగా జమిలికి సరేననాలి. ప్రస్తుతం బీజేపీ సారథ్యంలోని ఎన్డీఏ సొంతంగా 20 రాష్ట్రాల్లో అధికారంలో ఉంది. అందులో బీజేపీ సొంతంగా 13 రాష్ట్రాల్లో అధికారంలో ఉంది.

**1951-2019 వరకు ఎలా జరిగాయంటే?**

- 195152, 1957, 1962, 1967 సంవత్సరాల్లో లోక్‌సభకు, రాష్ట్రాల శాసనసభలకు ఏకకాలంలో ఎన్నికలు జరిగాయి. ఇలాంటి ఏర్పాటుకు వీలుగా బిహార్, బొంబాయి, మద్రాస్, మైసూర్, పంజాబ్, యూపీ, పశ్చిమబెంగాల్ శాసనసభలను వాటి పదవీకాలం ముగియకముందే రద్దు చేశారు.
- 196170 వరకు బిహార్, కేరళ, పంజాబ్, యూపీ, బంగాల్‌లలో మూడేసి సార్లు ఎన్నికలు జరిగాయి.
- 197180 వరకు ఈ పదేళ్లలో పరిస్థితి మరింత దిగజారింది. ఏకంగా 14 రాష్ట్రాల్లో మూడేసి సార్లు ఎన్నికలు నిర్వహించాల్సి వచ్చింది. ఒడిశాలోనైతే నాలుగుసార్లు జరిగాయి.
- 198190 వరకు ఐదు రాష్ట్రాల్లో మూడుసార్లు చొప్పున ఎన్నికలు నిర్వహించారు.
- 19912000 వరకు రెండు రాష్ట్రాల్లో మూడు సార్లు శాసనసభ ఎన్నికలు జరిగాయి. లోక్‌సభ ఏకంగా నాలుగుసార్లు ఎన్నికలకు వెళ్లింది.
- 1983 సంవత్సరంలో ఎన్నికల సంఘం వార్షిక నివేదిక జమిలి ఎన్నికల ఆలోచనను తెరపైకి తెచ్చింది.
- 2002లో వేర్వేరుగా ఎన్నికల నిర్వహణ బదులు ఏకకాలానికి మారాలని 'రాజ్యాంగ పనితీరుపై సమీక్షకు నియమితమైన జాతీయ కమిషన్ కోరింది. 1999, 2015, 2018లలో లా కమిషన్ కూడా ఒకేసారి ఎన్నికలకు సిఫార్సు చేసింది.
- 2015లో సిబ్బంది, ప్రజా ఫిర్యాదులు, న్యాయ శాఖల స్థాయీ సంఘం సమగ్రంగా అధ్యయనం చేసి, రెండు దశల్లో ఏకకాల ఎన్నికల పూర్తికి విధానాలు సూచించింది.
- 2017 జనవరిలో లోక్‌సభ, శాసనసభలకు ఒకేసారి ఎన్నికలు జరపడంపై విశ్లేషణకు నీతిఆయోగ్ వర్కింగ్ పేపర్‌ను రూపొందించింది.
- 2019లో పాలనా సంస్కరణలపై ఢిల్లీలో అఖిలపక్ష సమావేశంలో చర్చ జరిగింది. ప్రధానాంశాల్లో ఒకటిగా జమిలి ఎన్నికలు ఉన్నాయి.

**ఈ పార్లమెంట్ సెషన్‌లోనే..**

నవంబర్ 25 నుండి పార్లమెంట్ శీతాకాల సమావేశాలు జరగనుండగా, ఈ సమావేశాల్లోనే వన్ నేషన్ వన్ ఎలక్షన్ బిల్లు సభకు ముందు తెచ్చే అవకాశముంది. దీంతో లోక్ సభ హాట్ హాట్ గా జరగనుంది. వక్ఫ్ సవరణ బిల్లులతోపాటు జమిలి ఎన్నికలకు సంబంధించి బిల్లులు సభ ముందుకు రానుండగా, ప్రతిపక్షాలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాయి.

## పదవులను బాధ్యతగా

# భావించాలి

**అమరావతి, మహా :** రాష్ట్రంలో రెండవ లిస్టులో నామినేటెడ్ పదవులు పొందిన వారికి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు శుభాకాంక్షలు తెలిపారు. నామినేటెడ్ పదవుల మొదటి లిస్టులో 20 చైర్మన్ పోస్టులు, ఒక వైస్ చైర్మన్ పోస్టు భర్తీ చేసిన ప్రభుత్వం...రెండో లిస్టులో ఏకంగా 62 మందికి చైర్మన్ పదవులు, సలహాదారు పదవులు కట్టబెట్టింది. సుదీర్ఘ కసరత్తు తరువాత పదవుల కోసం వచ్చిన 30 వేల దరఖాస్తులను స్వయంగా పరిశీలించిన ముఖ్యమంత్రి నేతలను వివిధ పోస్టులకు ఎంపిక చేశారు. వీటిలో 60 రాష్ట్ర స్థాయి కార్పొరేషన్ పదవులు కాగా క్యాబినెట్ హోదాతో రెండు సలహాదారు పోస్టులున్నాయి. పదవులు పొందిన అందరికీ ముఖ్యమంత్రి శుభాకాంక్షలు తెలిపి వారికి అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా విడుదల చేసిన ప్రకటనలో ముఖ్యమంత్రి "కూటమి ప్రభుత్వంలో మీరు మంచి అవకాశాలు పొందారు. మనది పొలిటికల్ గవర్నెన్స్ అనే విధానం అని చెప్పాం. పొలిటికల్ గవర్నెన్స్ ను దృష్టిలో పెట్టుకుని నామినేటెడ్ పదవులకు ఎంపిక చేశాం. పొలిటికల్ గవర్నెన్స్ అంటే ప్రజలకు చేసే మంచిలో మీరూ భాగస్వాములు కావడమే. తద్వారా మరింత ఖచ్చితత్వంతో, క్షేత్ర స్థాయి పరిస్థితులకు అనుగుణంగా ప్రజలకు సేవ చేసే అవకాశం ఏర్పడుతుంది. అందుకే మీకొచ్చిన పదవులను బాధ్యతగా భావించి ప్రజల కోసం పనిచేయాలి. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోండి. పార్టీకి, ప్రభుత్వానికి మంచి పేరు తీసుకురండి." అని సిఎం అన్నారు. పదవుల ఎంపికపై సుదీర్ఘమైన, పటిష్టమైన కసరత్తు చేశామని, ఎంతో మంది ఆశావాహులు ఉన్నారన్నారు. అయితే కష్టపడిన వారికి న్యాయం చేయాలనే అంశం ప్రాతిపదికగా ముందుగా మిమ్మల్ని ఎంపిక చేశామని తెలిపారు. పార్టీ కోసం మీ పోరాటం, కష్టం, త్యాగం, పనితీరు, విధేయత, క్రమశిక్షణ ఆధారంగా ఈ ఎంపికలు జరిగాయని, సార్వత్రిక ఎన్నికల్లో సరైన వ్యక్తికి సరైన చోట టిక్కెట్ అనే విషయంలో అనుసరించిన విధానం మంచి ఫలితాన్ని ఇచ్చిందన్నారు. స్వయంగా ప్రజల నుంచి మీ ఎమ్మెల్యేగా ఎవరిని కోరకుంటున్నారు అని ఐవిఆర్ఎస్ ద్వారా తెలుసుకుని ప్రజామోదం ఉన్నవారికే టిక్కెట్లు ఇచ్చామన్నారు. అందుకే చరిత్రలో లేని విధంగా 93 శాతం స్ట్రైక్ రేట్ తో, 57 శాతం ఓట్ షేర్ తో కూటమికి పట్టం కట్టారన్నారు. నామినేటెడ్ పదవుల విషయంలోనూ అదే సూత్రాన్ని అవలంభించామని, ముఖ్యంగా తీవ్ర ప్రతికూల పరిస్థితుల్లో పార్టీ కోసం పని చేసిన వారికి పదవులు ఇచ్చామన్నారు..గత ప్రభుత్వ దాష్టికాలను ఎదుర్కొని 5 ఏళ్లు ధైర్యంగా నిలబడిన వారికి ఎక్కువ ప్రాధాన్యం ఇచ్చామని, కేసులు, దాడులు, వేధింపులకు గురైన వారిని గుర్తుపెట్టుకుని గౌరవించడం జరిగిందన్నారు. బూత్ స్థాయి కార్యకర్తలకు రాష్ట్ర స్థాయి పదవులు ఇచ్చే ఏకైక పార్టీగా మన తెలుగుదేశం నిలుస్తుందన్నారు. చాలా మంది బూత్ ఇంచార్జ్‌లు, క్లస్టర్ ఇంచార్జ్‌లు, యూనిట్ ఇంచార్జ్‌లు, గ్రామ అధ్యక్షులు, వార్డు అధ్యక్షులకు రాష్ట్ర స్థాయి పదవులు ఇచ్చామని పేర్కొన్నారు. రానున్న రోజుల్లోనూ మరిన్ని పదవులు ఇస్తామన్నారు. పార్టీ కోసం కష్టపడి పనిచేస్తే ఎక్కడో మారుమూల గ్రామంలో ఉన్నవారికీ పదవి లభిస్తుందనేది నేటి ఈ పోస్టుల ద్వారా మరోసారి అందిరికీ అర్థం అయ్యిందన్నారు. పనిచేసిన వారికి న్యాయం చేసే క్రమంలో జరిగిన తొలి ఎంపికల్లో మీరు అవకాశం పొందారు. రానున్న రోజుల్లో ఇతరులకు కూడా తగిన విధంగా అవకాశాలు కల్పించి, గౌరవిస్తాం. ఇంకా చాలా మందికి ఆయా కార్పొరేషన్ ల డైరెక్టర్లుగా, ఇతర పదవులు ఇస్తామని చంద్రబాబు అన్నారు. పదవులు వచ్చిన నాయకులు, యువత రెండేళ్ల పదవీ కాలాన్ని సమర్థవంతంగా ఉపయోగించుకుని ప్రజల కోసం నిజాయితీగా, కష్టపడి పని చేయడం ద్వారా రానున్న రోజుల్లో రాజకీయంగా మరింత ఎదగడానికి ఆస్కారం ఏర్పడుతుందన్నారు. సింపుల్ గవర్నమెంట్.....ఎఫెక్టివ్ గవర్నెన్స్ అనే మన నినాదాన్నిగుర్తు పెట్టుకుని ప్రజలతో మమేకమై పనిచేయాలని పదవులు పొందిన వారికి సీఎం సూచించారు. పదవులు వచ్చిన వారు ప్రజలతో మరింత సౌమ్యంగా, గౌరవంగా ఉండాలని ఎక్కడా పదవీ అహంకారం, హడావుడి అనేది కనిపించకూడదని అప్పుడే ప్రభుత్వంతో పాటు మీకూ మంచి పేరు వస్తుందని చంద్రబాబు సూచించారు

### పొంగులేటి బాంబుల శాఖామంత్రి

**వరంగల్, మహా :** తెలంగాణ మంత్రి, కాంగ్రెస్ నేత పొంగులేటి శ్రీనివాసరెడ్డిపై మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ వ్యంగ్యాస్త్రాలు సంధించారు. "పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి శాఖ ఏదో నాకు తెలియదు. కానీ ఆయనకు 'బాంబుల శాఖ' అని పెట్టండి. ఎందుకంటే ఈ బాంబు పేలుతుంది... ఆ బాంబు పేలుతుందని అన్నారు. మరి ఏ బాంబు పేలి కాంగ్రెస్‌లో ఎవరు ఎగిరిపోతారో ఆయనకే ఎరుక. మాకు తెలియదు. కానీ ఒకటి మాత్రం పక్కా. వాళ్లని మాత్రం వదిలిపెట్టం. కాంగ్రెస్ ప్రభుత్వ పరిపాలన వైఫల్యాల వారోత్సవం మేము నిర్వహిస్తాం" అని కేటీఆర్ అన్నారు. "కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి డిసెంబర్ 7కు ఏడాది పూర్తవుతుంది. వారోత్సవాలు, విజయోత్సవాలు చేయాలట. వీళ్లేదో పీకి పందిరేశారట. మేము కూడా చేస్తాం. నవంబర్ 29 నాడు కేసీఆర్ నిరాహార దీక్ష మొదలుపెట్టిన రోజు. అవసరమైతే మేము కూడా పార్టీలో చర్చించి వీళ్ల పరిపాలనా వైఫల్యాల వారోత్సవం చేస్తాం, ప్రకటిస్తాం. ఏ శాఖలో ఏ వర్గాన్ని ఎంత మోసం చేశారో మేము చెబుతాం. పాదయాత్రలు, మిగతా కార్యక్రమాలు తర్వాత ఉంటాయి" అని కేటీఆర్ చెప్పారు.

## బీసీల ఓట్ల కోసమే

# కులగణన జపం

**చేతి వృత్తుల వారికి హ్యాండిచ్చారు**

**పాతపథకాలకు పాతరేశారు**

**మాజీ మంత్రి కేటీఆర్ తీవ్ర విమర్శలు**

**వరంగల్ , మహా:** బీసీల ఓట్ల కోసం కులగణన పేరుతో తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం కొత్త నాటకానికి తెరతీసిందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. ఏడాది కిందట కామారెడ్డిలో కాంగ్రెస్ పార్టీ బీసీ డిక్లరేషన్ ప్రకటించిందని, కానీ ఇప్పటివరకూ ఎందుకు అమలు చేయలేదని కేటీఆర్ ప్రశ్నించారు. వెనుకబడిన వర్గాలకు కాంగ్రెస్ ప్రభుత్వం వెన్నుపోటు పొడిచిందని ఆయన మండిపడ్డారు. హనుమకొండ బీఆర్ఎస్ కార్యాలయంలో పార్టీ శ్రేణులతో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ ప్రభుత్వం, సీ ఎం రేవంత్ రెడ్డి తీవ్ర విమర్శలు గుప్పించారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి కేటీఆర్ మాట్లాడుతూ.. "బీసీల ఓట్ల కోసం కులగణన అనే కొత్త జపాన్ని సీఎం రేవంత్ రెడ్డి ఎత్తుకున్నారు. కులగణన కోసం వెళ్తున్న అధికారులను ప్రజలు నిలదీస్తున్నారు. ఆరు గ్యారెంటీలు ఏమయ్యాయని ప్రశ్నిస్తున్నారు. మహారాష్ట్ర ఎన్నికల్లో లబ్ధి పొందేందుకే తెలంగాణలో బీసీ కులగణన చేస్తున్నారు. కులగణన పేరుతో ప్రజల్ని మోసం చేసే కుట్ర జరుగుతోంది. బీసీలకు ముఖ్యమంత్రి క్షమాపణ చెప్పాలి. బలహీన వర్గాలకు రేవంత్ రెడ్డి బలమైన వెన్నుపోటు పొడిచారు. కులగణనను స్వాగతిస్తున్నాం.. కానీ దానిపై అనుమానాలు ఉన్నాయి. కులగణనలో ఆర్థిక, రాజకీయపరమైన ప్రశ్నలు తొలగించారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ఇచ్చిన తర్వాతే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలి. కాంగ్రెస్ అధికారంలో ఉన్నప్పుడు ఓబీసీ శాఖ పెట్టలేదు. ఓబీసీలకు కేంద్రంలో ప్రత్యేక శాఖ ఉండాలని కేటీఆర్ ఎప్పుడో చెప్పారు. కాంగ్రెస్ పాలనలో 34 మంది నేత కార్మికులు ఆత్మహత్యలు చేసుకున్నారు. చేతి వృత్తుల వారికి కాంగ్రెస్ హ్యాండ్ ఇచ్చింది. రేవంత్ రెడ్డి మా ఎమ్మెల్యేలపై దాడులు చేయడం ఆపాలి. మీ హామీలే పాములై మెడకు చుట్టుకుంటాయి. హామీలు విస్మరిస్తే ప్రజలే మిమ్మల్ని మళ్లీ రోడ్డుపై నిలబెడతారు. అధికారం చేపట్టి సంవత్సరమైనా మంత్రివర్గం పూర్తిగా నింపలేని అసమర్థుడు సీఎం రేవంత్ రెడ్డి. ఆయన ముఖ్యమంత్రి అయిన తర్వాత తెలంగాణలో రైతుబంధు, దళితబంధు వంటి అనేక పథకాలు ఆగిపోయాయి. కొత్త పథకాలు కాదు.. ఉన్న పథకాలకే పాతర వేశారు" అని మండిపడ్డారు.

### తెలంగాణ బియ్యాన్ని దిగుమతి చేసుకుంటాం



(మొదటిపేజీ తరువాయి)

తీరును తెలిపారు. శఅరీధర్ బాబు ప్రసంగం తర్వాత వ్యవసాయ విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ అల్దాస్ జానయ్య దిగుబడి పెంపు, సాగు ఖర్చును తగ్గించేందుకు అఇనుసరించాల్సిన విధానాలపై రైతులను చైతన్యవంతం చేస్తున్న తీరును తెలిపారు. ఈ సమావేశంలో పాల్గొన్న వ్యాపారవేత్తలు పలువురు తెలంగాణ బియ్యాన్ని మలేషియా దిగుమతి చేసుకుంటుందని హామీ ఇచ్చారు. దీంతో దిగుమతులకు రాష్ట్ర ప్రభుత్వం అనుసరించాల్సిన సులభతర పద్ధతులు ఎలా ఉండాలన్న అంశంపై మంత్రి, వనైస్ ఛాన్స్ లర్ తో పాటు టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్, సాట్ చైర్మన్ శివసేన రెడ్డి, ఉస్మానియా యూనివర్సిటీ వైస్ ఛాన్స్ లర్, విద్యా కమిషన్ చైర్మన్ ఆకునూరి మురళి తదితరులు అడిగి తెలుసుకున్నారు.

# మహారాష్ట్ర ఎన్నికలకు సీఎం డబ్బులు

**మాకు గ్రౌండ్ లేదు కాబట్టే పోటీకి దూరం**

**పాలన గాలికి వదిలి.. మంత్రులు రాష్ట్రాల బాట**

**మహారాష్ట్రలో రేవంత్ అబద్ధాలు చెప్పి వచ్చారు**

**ఇంకా 22లక్షల మందికి రుణమాఫీ పెండింగ్**

**మీడియా సమావేశంలో మాజీమంత్రి హరీష్ రావు ఆరోపణలు**

**హైదరాబాద్, మహా**: మహారాష్ట్ర ఎన్నికలకు సీఎం రేవంతే డబ్బులు సమకూర్చుతున్నారని మాజీమంత్రి హరీష్‌రావు విమర్శలు చేశారు. మహారాష్ట్రలో బీఆర్ఎస్‌కు పొలిటికల్‌గా గ్రౌండ్ లేదని , అందుకే మహారాష్ట్ర ఎన్నికల్లో తాము పోటీ చేయటం లేదని స్పష్టం చేశారు. ఆదివారం తెలంగాణ భవన్‌లో జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ పాలన గాలికి వదిలేసి మంత్రులు రాష్ట్రాల బాట పట్టారు. తెలంగాణ డబ్బును రేవంత్ రెడ్డి ఇతర రాష్ట్రాలకు పంపుతున్నాడు. మహారాష్ట్రలో ఏ పార్టీకి అనుకూలంగా.. వ్యతిరేకంగా ప్రచారం చేయం. కాంగ్రెస్ ఆరు గ్యారంటీలపై వాస్తవాలు చెప్పటం మా బాధ్యత. నిజాలు చెప్పటానికి మహారాష్ట్రకు వెళ్లిన రేవంత్ రెడ్డి అబద్ధాలు చెప్పి వచ్చారు. రుణమాఫీపై మహారాష్ట్రలో సీఎం రేవంత్ చెప్పినవన్నీ అబద్ధాలే. రుణమాఫీ బోగస్, రైతుబంధు బోగస్, వరికి బోనస్ బోగస్. కాంగ్రెస్ ఆరు గ్యారంటీలు.. గ్యారేజ్‌కు పోయాయి. రోడ్ల మీదున్న వడ్ల కుప్పలే.. రేవంత్ రెడ్డి అసమర్థ పాలనకు నిదర్శనం. 2లక్షల ఉద్యోగాల కల్పనపై మహారాష్ట్రలో రేవంత్ రెడ్డి పచ్చి అబద్ధాలు చెప్పారు. విద్యార్థులను వీపులు పగలగొట్టించిన చరిత్ర కాంగ్రెస్ సర్కార్‌ది. 40లక్షల మందికి రుణమాఫీ చేశామని రేవంత్ అబద్ధాలు చెప్పారు. ఇంకా 22లక్షల మందికి రుణమాఫీ జరగాల్సి ఉంది. పూర్తి రుణమాఫీ చేసి తీరాల్సిందే. ఒక్కొక్క రైతుకూ లీకి రూ.8వేలు కాంగ్రెస్ సర్కార్ బాకీ ఉంది" అని హరీష్‌రావు తీవ్ర విమర్శలు గుప్పించారు.




# ఆరిజోనా కూడా ట్రంప్‌దే

**ఏడు స్వింగ్ రాష్ట్రాలు క్లీన్‌స్వీప్**



**న్యూయార్క్:** అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో భాగంగా స్వింగ్ రాష్ట్రాల్లో ఒకటైన ఆరిజోనాను రిపబ్లికన్ పార్టీ అధ్యక్ష అభ్యర్థి డొనాల్డ్ ట్రంప్ గెలుచుకున్నారు. దీంతో ఏడు స్వింగ్ రాష్ట్రాలు ట్రంప్ వశమయ్యాయి. అరిజోనాలోని 11 ఎలక్టోరల్ ఓట్లు ట్రంప్ దక్కించుకోవడం వల్ల ఆయనకు వచ్చిన ఓట్లు 312కు చేరాయి. డెమొక్రటిక్ అభ్యర్థి కమలా హారిస్కు 226 ఎలక్టోరల్ ఓట్లు దక్కాయి. 2020 ఎన్నికల్లో డెమొక్రట్ల నుంచి ఆరిజోనాను గెలుచుకున్న వ్యక్తిగా జో బైడెన్ నిలిచారు. ఇప్పుడు డొనాల్డ్ ట్రంప్ దక్కించుకున్నారు.

**తొలిసారి**

2020 అధ్యక్ష ఎన్నికల్లో ఏడు స్వింగ్ రాష్ట్రాల్లో ఆరింటిని జో బైడెన్ గెలుచుకున్నారు. ఒక్క నార్త్ కరోలినా మాత్రమే ట్రంప్ దక్కించుకున్నారు. కానీ 2024 అధ్యక్ష ఎన్నికల్లో మాత్రం ట్రంప్ దూకుడు ప్రదర్శించారు. అరిజోనా, నెవాడా, విస్కాన్సిన్, మిచిగాన్, పెన్సిల్వేనియా, నార్త్ కరోలినా, జార్జియాను గెలుచుకున్నారు. దీంతో ఏడు స్వింగ్ రాష్ట్రాలు ట్రంప్ వశం అయ్యాయి.

**సెనేట్పై పట్టు**

అలాగే రిపబ్లికన్ పార్టీ సెనేట్పై మళ్లీ పట్టు సాధించింది. ప్రతినిధుల సభలో మెజారిటీ మార్క్కు చేరుకోవడానికి దగ్గరవుతోంది. ప్రస్తుతం సెనేట్లో రిపబ్లికన్లకు 52, డెమొక్రట్లకు 47 సీట్లు ఉన్నాయి. అలాగే హౌస్లో రిపబ్లికన్లు ఇప్పటివరకు 216 సీట్లు గెలుచుకోగా, డెమొక్రట్లు 209 సీట్లలో విజయం సాధించారు. హౌస్లో మెజారిటీ మార్క్ 218. ఈ సంఖ్యను దాటేస్తామని రిపబ్లికన్లు విశ్వాసం వ్యక్తం చేస్తున్నారు.

**కమిటీ వేసిన ట్రంప్**

**2025 జనవరి 20న జరగబోయే తన ప్రమాణ స్వీకారోత్సవ కార్యక్రమం ఏర్పాట్లను పర్యవేక్షించడానికి డొనాల్డ్ ట్రంప్ ఒక కమిటీని ఏర్పాటు చేశారు. ఆ కమిటీకి ట్రంప్ రన్నింగ్ మేట్ జేడీ వాన్స్ అధ్యక్షుడిగా ఉండగా, స్టీవ్ విట్ కాఫ్, సెనేటర్ కెల్లీ ఉపాధ్యక్షులుగా ఉంటారు. ఈ మేరకు ట్రంప్ వెల్లడించారు. అమెరికా ఎన్నికల్లో చరిత్ర సృష్టించామని ట్రంప్ పేర్కొన్నారు. అమెరికా ఫస్ట్ ఎజెండాకు ప్రజల నుంచి విపరీతమైన మద్దతు వచ్చిందని తెలిపారు.**

# ధరణి దందా

**బాప్‌రే.. ధరణి స్కామ్.. రూ. 60వేల కోట్లు**

**ప్రభుత్వ భూములన్నీ స్వాహా!.. ప్రైవేటు వ్యక్తులకు ధారాదత్తం**

**గత ప్రభుత్వంలో భూములన్నీ అన్యాక్రాంతం**

**ఒక్కొక్కటిగా వెలుగు చూస్తున్న అక్రమాలు**

**విచారణ జరపాలని రిటైర్డ్ రెవెన్యూ ఉద్యోగుల సంఘం లేఖ**




**మహా, హైదరాబాద్:** బీఆర్ఎస్ పాలనలో జరిగిన అక్రమాలు అన్నీఇన్నీకావు.. విస్తూపోయే నిజాలు వెలుగు చూస్తున్నాయి. ధరణి పోర్టల్ ద్వారా కొంత మంది అధికారులు ప్రభుత్వ భూములను ప్రైవేటు వ్యక్తులకు అప్పగించడంతో సుమారు రూ.60 వేల కోట్ల విలువైన భూములు అన్యాక్రాంతం అయ్యాయని తాజాగా రిటైర్డ్ రెవెన్యూ అధికారుల సంఘం ఆరోపించింది. దీనిపై విచారణ జరపాలని సీఎం రేవంత్ కు లేఖ రాశారు.

**ధరణి పోర్టల్ సాక్షిగా..**

గత ప్రభుత్వం భూముల రికార్డుల కోసం ప్రవేశ పెట్టిన ధరణి పోర్టల్ పై అనేక ఫిర్యాదులు వచ్చిన సంగతి తెలిసిందే. అయితే తాజాగా ధరణిపై సంచలన స్కామ్ బయటకు వచ్చింది. కొంత మంది రెవెన్యూ అధికారులు, ఉన్నత అధికారులు ఈ ధరణి పోర్టల్ ద్వారా అక్రమాలకు పాల్పడ్డారని.. చట్టవిరుద్ధంగా ప్రభుత్వ భూములను ప్రైవేటు సంస్థలకు, వ్యక్తులకు అప్పగించారాని ఆరోపణలు వచ్చాయి. ఈ క్రమంలోనే దాదాపు రూ.60 వేల కోట్ల విలువైన భూములు ప్రైవేట్ వ్యక్తుల చేతులోకి వెళ్ళాయాని రిటైర్డ్ రెవెన్యూ అధికారుల సంఘం ఆరోపించింది. ఈ భూదందాపై విచారణ జరిపించాలని కేంద్ర విజిలెన్స్ కమిషన్, సీఎం రేవంత్ రెడ్డి, రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి, హైకోర్టు చీఫ్ జస్టిస్ తో పాటు పలు విచారణ ఏజెన్సీలకు లేఖ రాసినట్లు సమాచారం.

**1000 ఎకరాల వరకు...**

రంగారెడ్డి జిల్లా గుట్టల బేగంపేటలోని సర్వే నంబర్ 63లోని 42ఎకరాలు, గోపనపల్లి గ్రామంలో సర్వే నంబర్ 124/10లో 50 ఎకరాలు, సర్వే నంబర్ 36, 37లో 600ఎకరాలు, హాఫీజ్‌పేట సర్వే నెంబర్ 80లో 20 ఎకరాలు, మోఖిలా దగ్గర సర్వే నంబర్ 555లో బిల్లాదాఖల భూములు 150 ఎకరాలు, మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా, కూకట్‌పల్లి మండలం యల్లమ్మబండ(షాంబిగూడ) పరిధిలో సర్వే నెంబర్ 57లో 92 ఎకరాలను చట్టవిరుద్ధంగా విక్రయించారని విజిలెన్స్ కమిషన్‌కు రిటైర్డ్ రెవెన్యూ అధికారులు రాసిన లేఖలో పేర్కొన్నారు. చేతులు మారిన భూములను రాష్ట్ర ప్రభుత్వం తిరిగి స్వాధీనం చేసుకోవాలని కోరారు.

# విద్యకు కాంగ్రెస్ ప్రభుత్వం పెద్ద పీట

**మహా, ఆదిలాబాద్:** తెలంగాణ ప్రభుత్వం విద్యకు పెద్దపీట వేస్తున్నదని, తెలంగాణ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్‌కు తనవంతు ఎల్లవేళలా సహాయ సహకారాలు ఉంటాయని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు, ఆదిలాబాద్ అసెంబ్లీ ఇన్ ఛార్జ్ కంది శ్రీనివాసరెడ్డి అన్నారు. ఆదిలాబాద్ పట్టణంలోని టీటీడీ కళ్యాణ మండపంలో టీయూటీఎఫ్ 6వ రాష్ట్ర మహాసభలు ఆదివారం అట్టహాసంగా జరిగాయి. ఈ మహాసభలకు విశిష్ట అతిథిగా కంది శ్రీనివాసరెడ్డి హాజరవ్వగా సంఘం బాధ్యులు ఆయనకు సాదరంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా కంది శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ...విద్యారంగానికి కాంగ్రెస్ ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని అన్నారు. ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేసి పేదలకు మంచి నాణ్యమైన విద్యనందించేందుకు పాటుపడుతోందని అన్నారు. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానన్నారు. భవిష్యత్తులో సంఘం అభివృద్ధికి, సంక్షేమానికి తనవంతు సహకారం అందిస్తానన్నారు. సంఘం ఆశలు, ఆశయాలు, లక్ష్యాలు నెరవేరాలని ఆయన మనస్ఫూర్తిగా ఆకాంక్షించారు.

**సమస్యలపై టీయూటీఎఫ్ రాజీలేని పోరాటాలు: రాష్ట్ర అధ్యక్షులు లచ్చిరాం**

ఆవిర్భావం నుండి నేటి వరకు కూడా విద్యారంగం, ఉపాధ్యాయుల సమస్యలపై టీయూటీఎఫ్ రాజీలేని పోరాటాలు చేస్తోందని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు తుమ్మ లచ్చిరాం అన్నారు. ఆదిలాబాద్ పట్టణంలోని టీటీడీ కళ్యాణ మండపంలో టీయూటీఎఫ్ 6వ రాష్ట్ర మహాసభలను ఘనంగా నిర్వహించారు. ఈసభలకు రాష్ట్రంలోని 33 జిల్లాల నుంచి పెద్దసంఖ్యలో ఉపాధ్యాయులు, ఉపాధ్యాయ సంఘం సభ్యులు పెద్ద ఎత్తున పాల్గొని దిగ్విజయం చేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షులు మాట్లాడుతూ...ఆనాడు చారిత్రక అవసరంగా ఏర్పడిన టీయూటిఎఫ్ ఇవాళ ఉపాధ్యాయ సమస్యల పరిష్కారంలో వెనకడుగు వేయకుండా పోరాటాలు చేస్తోందన్నారు. ప్రభుత్వాలు ఏవైనా సమస్యలను సర్కార్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించడంలో సంఘం విశేషంగా కృషి చేస్తోందన్నారు. ఈ సభలో అనేక సమస్యలపై చర్చించి డిమాండ్ల సాధనకై పలు తీర్మానాలు చేశారు. ఈ కార్యక్రమంలో డీఈవో ప్రణీత, టీయుటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు తుమ్మ లచ్చీరాం ,ప్రధాన కార్యదర్శి రఘనందన్ రెడ్డి ,బేర దేవన్న గౌరవాధ్యక్షుడు,మురళీ మనోహర్ రెడ్డి రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు,మొగిలయ్య రాష్ట్ర ఆర్థిక కార్యదర్శి,గోపాల్ రాష్ట్ర ఆడిట్ కన్వీనర్, మల్లారెడ్డి ,కైలాసం వ్యవస్థాపక అధ్యక్షప్రధాన కార్యదర్శులు , దామెర శ్రీనివాస్ , నూతకంటి బాబు,స్వర్ణలత, వెంకన్నస్నేహ పాల్గొన్నారు.



# రాయలసీమకు బాబు గుడ్ న్యూస్

## ఇక రతనాల సీమే.. కొత్త ప్రకటనపై సర్వత్రా ఆసక్తి

**ఆంధ్రప్రదేశ్ బ్యూరో, మహా:**

రాయలసీమ రూపం మారిపోనుందా? రాళ్ల సీమ రతనాల సీమ వైభవాన్ని సంతరించుకోనుందా? చంద్రబాబు సీమ చరిత్రలో సరికొత్త అధ్యాయం లిఖించబోతున్నారా? తాజా అడుగులపై సర్వత్రా ఆసక్తి నెలకొంది. ఆంధ్ర ప్రదేశ్ లో మూడు ప్రాంతాల అభివృద్ధిపై చంద్రబాబు తన దృష్టిని కేంద్రీకరించారు. ఇప్పటికే ఉత్తరాంధ్రతో పాటు విశాఖ అభివృద్ధికి కట్టుబడి ఉన్నట్టు ప్రకటించిన బాబు, అటు రాజధాని అమరావతిలో తమ ప్రభుత్వ హయాంలో ప్రారంభమై నిలిచిపోయిన పనులను తిరిగి పరుగులు పెట్టిస్తున్నారు. అంతేకాదు గతంలో రాజధాని అమరావతిలో పలు కేంద్ర సంస్థలకు కేటాయించిన భూములను తిరిగి వాటికి అప్పగించనున్నారు. అంతేకాదు అమరావతిలో రైలు, రోడ్డు సహా పలు అభివృద్ధి పథకాలను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయబోతున్నట్టు ప్రకటించిన సంగతి తెలిసిందే కదా. కేవలం ఉత్తరాంధ్ర, రాజధాని అమరావతిలే కాకుండా.. రాయలసీమకు త్వరలోనే గుడ్ న్యూస్ వినిపిస్తానంటూ సీఎం చంద్రబాబు నాయుడు వ్యాఖ్యానించారు. శ్రీశైలం పర్యటనలో చేసిన వ్యాఖ్యలు ప్రస్తుతం ఆసక్తికరంగా మారాయి. సీఎం చంద్రబాబు చెప్పబోయే ఆ శుభవార్త ఏమిటా అనే దానిపై చర్చలు జరుగుతున్నాయి. ఏపీ సీఎం చంద్రబాబు మనసులో ఏముంది? దేని గురించి మాట్లాడారు? అనే విషయంపై విశ్లేషణలు జరుగుతున్నాయి. తన ప్లాన్ సక్సెస్ అయితే రాయల సీమ రతనాలసీమగా మారుతుందంటూ సీఎం చంద్రబాబు చెప్పిన నేపథ్యంలో.. ఏదైనా భారీ పరిశ్రమను ఏర్పాటు చేస్తున్నారా? లేకపోతే.. రాయలసీమను ఆధ్యాత్మికంగా అభివృద్ధి పథంలోకి తీసుకొస్తారా అనే అంశంపై చర్చ జరుగుతోంది. ఇప్పటికే అమెరికా పర్యటనకు వెళ్లిన నారా లోకేష్ అనంతపురంలో టెస్లా ప్లాంట్ ఏర్పాటు చేయాలని కోరిన నేపథ్యంలో.. ఈ దిశగా ఏమైనా ప్రకటన ఉంటుందా అనే విషయంపై సర్వత్రా చర్చ జరుగుతోంది. అంతేకాదు అమెరికాలో కొత్తగా ట్రంప్ సర్కార్ ఏర్పడటంతో భారత్, అమెరికా మధ్య సంబంధాలు మరింత బలపడే అవకాశాలున్నాయి. మరోవైపు నరేంద్ర మోడీతో ట్రంప్ కు మంచి మిత్రత్వం ఉండటం కలిసొచ్చే అంశాలు అని చెప్పాలి. ఈ నేపథ్యంలో బాబు ప్లానింగ్ , ప్రణాళికలు వినేందుకు అంతా ఆసక్తిగా ఉన్నారు.



## మహిళలకు నెలకు రూ.3 వేలు.. ఫ్రీ బస్సు

**నిరుద్యోగులకు రూ.4వేలు**
**మహారాష్ట్ర ఓటర్లపై ఎంవీఏ వరాల జల్లు**
**జనాకర్షమంత్రం**

**మహా, ముంబై:** మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల కోసం మహా వికాస్ అఘాడీ ఉమ్మడి మేనిఫెస్టోను విడుదల చేసింది. మహాలక్ష్మి యోజన కింద మహిళలకు నెలకు రూ.3,000 ఆర్థిక సాయం చేస్తామని తెలిపింది. అలాగే మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పిస్తామని హామీ ఇచ్చింది. డిగ్రీ, డిప్లొమా చేసిన నిరుద్యోగులకు నెలకు స్టైఫండ్ కింద రూ.4 వేలు అందజేస్తామని పేర్కొంది. రిజర్వేషన్లపై ఉన్న 50 శాతం పరిమితిని తొలగిస్తామని వెల్లడించింది. అలాగే మహారాష్ట్రలో మహా వికాస్ అఘాడీ కూటమి అధికారంలోకి వస్తే కులగణన చేస్తామని హామీ ఇచ్చింది. ముంబయిలోని ట్రైడెంట్ హోటల్ లో కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే కూటమి ఉమ్మడి మేనిఫెస్టోను 'మహారాష్ట్ర నామా' పేరిట రిలీజ్ చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్, రాజస్థాన్ మాజీ ముఖ్యమంత్రి అశోక్ గహ్లోత్, ఎంపీ అభిషేక్ మను సింఘ్వీ, మహారాష్ట్ర కాంగ్రెస్ చీఫ్ నానా పటోలే, శివసేన ఎంపీ సంజయ్ రౌత్, ఎన్ సీపీ ఎంపీ సుప్రియా సూలే తదితరులు పాల్గొన్నారు.

## మాజీ ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ నివాసంలో

# అయిదవ రోజు సాగిన ఐటీ సోదాలు

- ఈ నెల 5 న చెన్నై నుంచి వచ్చిన ఐటీ అధికారులు
- గ్రంధి వ్యాపార భాగస్వాములు, అనుచరుల ఇళ్లలోనూ తనిఖీలు
- ఇప్పటికే పలు కీలక పత్రాలు, నగదు స్వాధీనం

**భీమవరం, మహా :** పశ్చిమ గోదావరి జిల్లా భీమవరంలో వైసీపీ మాజీ ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ నివాసంలో ఐటీ సోదాలు కొనసాగుతున్నాయి. చెన్నై నుంచి వచ్చిన ఆదాయ పన్ను శాఖ అధికారులు ఐదో రోజు (ఆదివారం) కూడా తనిఖీలు నిర్వహించారు. గ్రంధి శ్రీనివాస్ వ్యాపార భాగస్వాములు, ఆయన అనుచరుల ఇళ్లలోనూ ఐటీ అధికారులు సోదాలు చేపట్టారు. ప్రకాశం జిల్లా సింగరాయకొండ శివార్లలో ఉన్న జీవీఆర్ ఆక్వా సంస్థలోనూ సోదాలు చేపట్టారు. అధికారులు ఇప్పటికే పలు కీలక పత్రాలు స్వాధీనం చేసుకున్నట్టు తెలుస్తోంది. కొంతమేర నగదును కూడా స్వాధీనం చేసుకున్నట్టు ప్రచారం జరుగుతోంది. గత బుధవారం గ్రంధి శ్రీనివాస్ హైదరాబాద్ వెళుతుండగా, మార్గమధ్యంలోనే ఐటీ అధికారుల నుంచి ఫోన్ వచ్చింది. దాంతో ఆయన ప్రయాణాన్ని విరమించుకుని, భీమవరం తిరిగొచ్చారు. గత ఎన్నికల్లో గ్రంధి శ్రీనివాస్ జనసేన అభ్యర్థి పులపర్తి రామాంజనేయులు చేతిలో ఓటమి పాలయ్యారు. అప్పటినుంచి ఆయన వైసీపీతో అంటీముట్టనట్టుగా వ్యవహరిస్తున్నారు. ఇటీవల గ్రంధిపై పవన్ కల్యాణ్ ఫిర్యాదు చేసినట్టు వార్తలు వచ్చాయి. అయితే ఏకంగా ఐటీ అధికారులు రంగంలోకి దిగడం గమనార్హం. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో పవన్ పై ఒంటికాలి మీద ధ్వజమెత్తిన వారిలో గ్రంధి శ్రీనివాస్ కూడా ఉన్నారు. పవన్ కు పలుమార్లు సవాళ్లు కూడా విసిరారు. 2019 ఎన్నికల్లో పవన్ గాజువాక, భీమవరం నియోజకవర్గాల్లో పోటీ చేయగా... భీమవరంలో ఓడిపోయింది గ్రంధి శ్రీనివాస్ చేతిలోనే. ఏపీలో కూటమి ప్రభుత్వం తిరుగులేని మెజారిటీతో అధికారంలోకి రావడంతో వైసీపీ శ్రేణులు కొంత మేర స్థబ్దుగా ఉన్నాయి. అయితే రాష్ట్రంలో జరుగుతున్న పరిణామాల నేపథ్యంలో వైసీపీ నేతలపై ఏదో ఒక కేసు నమోదవడంతో ప్రస్తుతం చర్చనీయాంశంగా మారింది. వాస్తవానికి కొన్నాళ్ళుగా గ్రంధి శ్రీనివాస్ పై ఆరోపణలున్నాయి. ఆరోపణల పరంపర రోజురోజుకూ పెరుగుతుండటంతో నిజాన్ని నిగ్గు తేల్చేందుకు ఐటీ దాడులు జరుగుతున్నాయన్న చర్చ కూడా మొదలైంది.



## కాలి బూడిదైన కంటైనర్

**8 కార్లు బుగ్గిపాలు**



**సంగారెడ్డి, మహా :** సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ బైపాస్ రోడ్డులో భారీ అగ్నిప్రమాదం చోటు చేసుకుంది. కార్లు తరలిస్తున్న కంటైనర్‌లో ప్రమాదవశాత్తు మంటలు చెలరేగి భారీగా మంటలు ఎగిసిపడ్డాయి. దీంతో కంటైనర్‌లో తరలిస్తున్న 8 కార్లు కాలి బూడిదయ్యాయి. టాటా నెక్సన్ మోడల్‌కు చెందిన కార్లను ముంబయి నుంచి హైదరాబాద్ రవాణా చేస్తుండగా బైపాస్ రోడ్డులో రంజోల్ వద్ద అగ్నిప్రమాదం జరిగింది. జహీరాబాద్ అగ్నిమాపక శాఖ ఫైర్ ఇంజిన్ సహా మహేంద్ర అండ్ మహీంద్రా కర్మాగారం ఫైర్ ఇంజిన్ సిబ్బంది తొలుత ప్రయత్నించినా మంటలు అదుపులోకి రాలేదు. ఈ క్రమంలో ముంబయి - హైదరాబాద్ 65వ నంబర్ జాతీయ రహదారిపై భారీగా రాకపోకలు స్తంభించాయి. ప్రమాదంలో అగ్నికీలలు ఎగిసిపడి కార్లలోని సామగ్రి భారీ శబ్దాలతో గాల్లోకి ఎగిరి పడ్డాయి. అగ్నిమాపక శాఖ తీవ్రంగా శ్రమించి ఎట్టకేలకు మంటలను ఆర్పివేశారు. అగ్నిప్రమాదానికి గల కారణాలపై అధికారులు దర్యాప్తు జరుపుతున్నారు.

# పోటాపోటీగా మేనిఫెస్టో విడుదల

## ఏ I శిక్షణ ల్యాబ్‌లు, 25 లక్షల ఉద్యోగాలంటూ బీజేపీ హామీ

**ముంబై, మహా :** మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలకు సమయం దగ్గర పడుతున్న వేళ పార్టీలన్నీ ఓటర్లను ఆకట్టుకునే పనిని వేగవంతం చేశాయి. అధికారాన్ని అప్పగిస్తే ఏం చేస్తామన్న అంశంపై కాంగ్రెస్, బీజేపీ కూటమి తరఫున హామీలను గుప్పిస్తున్నాయి. కాంగ్రెస్, బీజేపీలు పోటాపోటిగా మేనిఫెస్టోలను విడుదల చేసి ఓటర్లను ప్రసన్న చేసుకునే పనిని మరింతగా ముమ్మరం చేశాయి. బీజేపీ కూటమి తరఫున మేనిఫెస్టోను కేంద్ర హోం మంత్రి అమిత్ షా విడుదల చేయగా, కాంగ్రెస్ కూటమి తరఫున మేనిఫెస్టోను ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ఆవిష్కరించారు. దీంతో నిన్నటి వరకు పార్టీల పరగా జరిగిన ప్రచారం ఇక నుంచి మేనిఫెస్టోలలో పొందుపరచిన అంశాలపై జరిగే అవకాశాలున్నాయన్న చర్చ జోరందుకుంది.

సంకల్ప పత్ర పేరుతో బీజేపీ ఎన్నికల మేనిఫెస్టోను విడుదల చేసింది. ముంబయిలో నిర్వహించిన సమావేశంలో కేంద్ర హోంమంత్రి అమిత్ షా మేనిఫెస్టోను రిలీజ్ చేశారు. ఈ కార్యక్రమంలో కేంద్ర మంత్రి పీయూశ్ గోయల్, మహారాష్ట్ర ఉప ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడణవీస్ సహా పలువురు ముఖ్యనేతలు పాల్గొన్నారు. మేనిఫెస్టోలో రైతుల పంట రుణాల మాఫీ, ఏఐ శిక్షణ ల్యాబ్‌లు, నైపుణ్య గణన, 25 లక్షల ఉద్యోగాలను ప్రధానంగా పేర్కొన్నారు. వృద్ధులకు ప్రస్తుతం ఇస్తున్న పింఛన్‌ను రూ. 1500 నుంచి రూ. 2100కు పెంచుతామని చెప్పారు. మహారాష్ట్రను దేశంలో మొదటి ట్రిలియన్ ఆర్థిక వ్యవస్థగా మార్చాలని కోరుకుంటున్నట్టు పేర్కొన్నారు.

**ఓటర్లపై వరాల జల్లు**

లడ్కీ బెహన్ యోజన కింద మహిళలకు నెలకు రూ. 2100 ఆర్థిక సహాయం అందించనున్నట్లు అమిత్ షా తెలిపారు. సమ్మాన్ నిధి రూ.12,000 నుంచి రూ.15,000కి పెంచుతామని హామీ ఇచ్చారు. అంగన్‌వాడీ కార్యకర్తలకు నెలకు రూ.15 వేలు వేతనాన్ని ఇస్తామని పేర్కొన్నారు. "ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ పారిశ్రామికవేత్తలకు రూ.15 లక్షల వడ్డీ లేని రుణాలు ఇస్తాం. 2028 నాటికి మహారాష్ట్రను 1 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా మారుస్తాం. బలవంత మత మార్పిడులకు వ్యతిరేకంగా కఠినమైన చట్టం తెస్తాం. అలాగే విద్యుత్ ఛార్జీలను తగ్గిస్తాం" అని అమిత్ షా పేర్కొన్నారు.

**మహిళలకు నెలకు రూ. 3 వేలు: కాంగ్రెస్**

మహా వికాస్ అఘాడీ ఉమ్మడి మేనిఫెస్టోను విడుదల చేసింది. మహాలక్ష్మి యోజన కింద మహిళలకు నెలకు రూ.3,000 ఆర్థిక సాయం చేస్తామని తెలిపింది. అలాగే మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పిస్తామని హామీ ఇచ్చింది. డిగ్రీ, డిప్లొమా చేసిన నిరుద్యోగులకు నెలకు స్టైఫండ్ కింద రూ.4 వేలు అందజేస్తామని పేర్కొంది. రిజర్వేషన్లపై ఉన్న 50 శాతం పరిమితిని తొలగిస్తామని వెల్లడించింది. అలాగే మహారాష్ట్రలో మహా వికాస్ అఘాడీ కూటమి అధికారంలోకి వస్తే కులగణన చేస్తామని హామీ ఇచ్చింది. ముంబయిలోని ఒక హోటల్ లో కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే కూటమి ఉమ్మడి మేనిఫెస్టోను 'మహారాష్ట్ర నామా' పేరిట రిలీజ్ చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్, రాజస్థాన్ మాజీ ముఖ్యమంత్రి అశోక్ గహ్లోత్, ఎంపీ అభిషేక్ మను సింఘ్వీ, మహారాష్ట్ర కాంగ్రెస్ చీఫ్ నానా పటోలే, శివసేన ఎంపీ సంజయ్ రౌత్, ఎన్ సీపీ ఎంపీ సుప్రియా సూలే తదితరులు పాల్గొన్నారు.

# రైతులను వంచిస్తున్న కాంగ్రెస్ సర్కార్

**జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు మంచిరెడ్డి కిషన్ రెడ్డి**

**వడ్లు కొనుగోళ్లు వెంటనే ప్రారంభించాలి**
**లేదంటే రైతులతో కలిసి పోరాటమే**
**కల్లాలలో రైతులను కలిసిన బీఆర్ఎస్ నేతలు**
**కొనుగోళ్లు ప్రారంభిస్తామని అధికారుల హామీ**



**ఇబ్రహీంపట్నం, మహా :** అన్నదాతలకు అరచేతిలో వైకుంఠం చూపి అధికారంలో వచ్చిన కాంగ్రెస్ పార్టీ అడుగడుగునా రైతులను వంచించిందని జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు, ఇబ్రహీంపట్నం మాజీ ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్ రెడ్డి విమర్శించారు. ఆదివారం ఆయన జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మెన్ సత్తు వెంకటరమణారెడ్డి, బీఆర్ఎస్ నాయకులతో కలిసి శేరిగూడ, మల్ శెట్టిగూడ గ్రామాలలో పర్యటించి వ్యవసాయ కల్లాల వద్ద రైతులతో మాట్లాడారు. కోతలు మొదలై ఇరవై రోజులు దాటినా కల్లాలవద్దే పడిగాపులు కాస్తున్న రైతులతో వారి ఇబ్బందులను ఆయన అడిగి తెలుసుకున్నారు. ఇరవై రోజులుగా వడ్ల కుప్పల వద్ద ఎండకు ఎండి, వానకు తడుస్తూ తాము ఎదుర్కొంటున్న ఇబ్బందులను బీఆర్ఎస్ బృందానికి రైతులు వివరించారు. ఐదు రోజుల క్రితం కొనుగోలు కేంద్రాలు తెరిచినా, ఎప్పటినుండి కొంటారో చెప్పేవారు కూడా అక్కడ దిక్కులేరని వారు వాపోయారు. ఈ సందర్భంగా రైతులనుద్దేశించి మంచిరెడ్డి మాట్లాడుతూ కెసిఆర్ ప్రభుత్వం చేపట్టిన ప్రతి పనికి ప్రణాళిక, ముందుచూపు ఉండేదని కాంగ్రెస్ కు ఆపని చేతకావడం లేదన్నారు. సీజన్ కు ముందే ఎరువులు, విత్తనాలు సిద్ధం చేసుకోవడం, కోతలకు ముందే కొనుగోలు ప్రణాళికలు తయారు చేసుకోవడం తెలియక సమస్యలు తలెత్తుతున్నాయన్నారు. కాంగ్రెస్ పాలకులకు సంపాదన, దందాల మీద ఉన్న శ్రద్ధ రైతులపై లేదని మండిపడ్డారు. రుణమాఫీ పేరిట 22 లక్షల మంది రైతులకు 17 వేల కోట్లు మాఫీ చేసి, 64 లక్షల మంది రైతులకు పదహారున్నర వేల కోట్లు రైతు భరోసా డబ్బులు నిస్సిగ్గుగా ఎగ్గొట్టారని దుయ్యబట్టారు. కౌలు రైతులకు ఎకరాకు 15 వేలు, రైతు కూలీలకు ఏడాదికి 12 వేలు ఇస్తామన్న మాటలు రేవంత్ సర్కార్ మరిచిపోయిందన్నారు. అన్ని పంటలకు క్వింటాలుకు రూ. 500 బోనస్ ఇస్తామని ఎన్నికల ముందు చెప్పి ఇప్పుడు మాట మార్చారని దెప్పి పొడిచారు. జిల్లా పౌరసరఫరాల శాఖ మేనేజర్ గోపీకృష్ణకు ఫోన్ చేసి రైతుల కష్టాలను ఆయన వివరించారు. ఇన్ని రోజులైనా ఒక్క గింజ కూడా కొనకపోవడమేమిటని ఆయన ప్రశ్నించారు. సోమవారం నుండి పూర్తిస్థాయిలో కొనుగోలు చేస్తామని మేనేజర్ హామీ ఇచ్చారు. లేనట్లయితే రైతులతో బీఆర్ఎస్ చేపట్టే ఉద్యమానికి ప్రభుత్వమే భాధ్యత వహించాల్సి ఉంటుందని మంచిరెడ్డి ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ బీఆర్ఎస్ అధ్యక్షుడు అల్వాల వెంకట్ రెడ్డి, మున్సిపల్ మాజీ వైస్ చైర్మెన్ ఆకుల యాదగిరి, మొద్దు అంజిరెడ్డి, సొసైటీ మాజీ వైస్ చైర్మెన్ క్యామ శంకర్, మున్సిపల్ బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి పొట్టి శ్రీకాంత్, మాజీ సర్పంచులు మల్లేష్ యాదవ్, కాలె గణేష్ , మున్సిపల్ కౌన్సిలర్ సంధ్య దయాకర్, రైతు నాయకులు వీరారెడ్డి, మహేందర్, సురేందర్, శ్రీశైలం, మాజీ ఎంపిటిసి మైసయ్య, సుదర్శన్ రెడ్డి, నారాయణ రెడ్డి పాల్గొన్నారు

## సరూర్ నగర్‌లో కాల్పుల కలకలం

**సరూర్ నగర్, మహా :** అనునిత్యం రద్దీగా ఉండే సరూర్ నగర్ ప్రాంతంలో ఆదివారం మధ్యాహ్నం కాల్పుల కలకలం రేగింది. వెంకటేశ్వర కాలనీ రోడ్డు నెంబర్ 14లో మల్లికా రాణి అపార్ట్‌మెంట్ లో ఎయిర్ గన్ తో రేవంత్ ఆనంద్ అనే వ్యక్తి తన కూతురి ప్రియుడు బల్విందర్ సింగ్ పై ఎయిర్ గన్ తో కాల్పులకు తెగబడ్డాడు. ఈ ఘటనలో బల్విందర్ సింగ్ కంటిలో బుల్లెట్ దిగడంతో తీవ్రంగా ఘాయపడ్డాడు. వివరాలలోకి వెళితే అంబర్ పేటకి చెందిన బల్విందర్ సింగ్ (25) మన్వీత (23) ఇద్దరు గత కొంత కాలంగా ప్రేమించుకున్నారు.. ఇంట్లో తెలియడంతో కుటుంబసభ్యులు అమ్మాయిని ఎవరికీ తెలియకుండా ఈ మధ్యనే అమెరికాకు పంపించారు. విషయం తెలుసుకున్న బల్విందర్ సింగ్ ఈ విషయంపై అమ్మాయి తండ్రి రేవంత్ ఆనంద్ తో ఇంటికి వచ్చి వాగ్వాదానికి దిగాడు. దీంతో ఆగ్రహించిన రేవంత్ ఆనంద్ ఇంట్లో ఉన్న ఎయిర్ గన్ తో బల్విందర్ సింగ్ పై కాల్పులు జరిపాడు. విషయం తెలుసుకున్న పోలీసులు హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకుని గాయపడ్డ బల్విందర్ సింగ్ ను ఆస్పత్రికి తరలించారు. కాల్పులకు పాల్పడ్డ రేవంత్ ఆనంద్ ను అదుపులోకి తీసుకున్నారు.

# సారు.. షికారు!





**కారు నడిపిన కేసీఆర్**

**మహా, హైదరాబాద్:** బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ కారు నడిపిన ఫొటోలు తాజాగా సామాజిక మాధ్యమాల్లో చక్కర్లు కొడుతున్నాయి. మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి కొడుకు పట్లోళ్ల కార్తీక్ రెడ్డిని పక్కన కూర్చోబెట్టుకుని కేసీఆర్ కారు నడిపారు. ఇద్దరు కలిసి పంట పొలాలను పరిశీలించారు. ఇందుకు సంబంధించిన ఫొటోలు వైరల్ కావడంతో.. మళ్లీ ప్రజల్లోకి వచ్చే సంకేతాలు గులాబీ బాస్ ఇస్తున్నారని నెటిజన్లు కామెంట్స్ చేస్తున్నారు. పులి బయటకు వస్తోందని బీఆర్ఎస్ శ్రేణులు చెబుతున్నారు. ఇదిలా ఉండగా.. శనివారం ఎర్రవెల్లి ఫామ్స్ వద్ద పాలకుర్తి నయోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ నాయకులతో కేసీఆర్ సమావేశం అయ్యారు. మొదటి సారి రాజకీయ పరమైన అంశాలను చర్చించారు. వచ్చే ఎన్నికల్లో 100 శాతం మనమే అధికారంలోకి వస్తామని ప్రకటించారు.

# కారు బోల్తా ఇద్దరు యువకుల మృతి

## అయిదుగురిని గాయాలు.. ముచ్చర్ల గేటు సమీపంలో ఘటన

**మహేశ్వరం, మహా :** హైదరాబాద్ శ్రీశైలం జాతీయ రహదారిపై ఆదివారం తెల్లవారుజామున కారు బోల్తా పడింది. ఈ ప్రమాదంలో హైదారాబాద్ పాత బస్తీకి చెందిన ఇద్దరు యువకులు మృతి చెందారు. హైదరాబాద్ నుంచి కడ్తాల్ వైపు మహేంద్ర ఎక్స్యూవి టీఎస్ 09 ఈహెచ్ 0362 వాహనంలో వస్తుండగా కందుకూరు మండలం ముచ్చర్ల గేటు సమీపంలో ఈ ఘటన జరిగింది. మృతులు పహాడీ షరీఫ్ ప్రాంతానికి చెందిన నయాబ్, ఇంతియాజ్ గా గుర్తించారు. వీరంతా శ్రీశైలం డ్యాం సందర్శనకు వెళ్తున్నట్లు తెలిసింది. మిగతా 5 మంది యువకులు స్వల్ప గాయాలతో ప్రమాదం నుండి బయట పడ్డారు. ఘటనా స్థలానికి చేరుకున్న గ్రీన్ ఫార్మా సిటీ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



# కుటుంబ సర్వేను పరిశీలించిన కలెక్టర్

**ఉప్పరిగూడలో ఆకస్మిక తనిఖీ**

**అన్ని వర్గాల ప్రజలు సహకరించాలి**
**ఎలాంటి అపోహలకు తావివ్వకూడదు**
**రంగారెడ్డి జిల్లా కలెక్టర్ సి నారాయణ రెడ్డి**



**ఇబ్రహీంపట్నం, మహా :** రంగారెడ్డి జిల్లాలో హౌస్ లిఫ్టింగ్ సర్వేను అన్ని మున్సిపాలిటీలలో గ్రామపంచాయతీలలో దిగ్విజయంగా నిర్వహించడం జరిగిందని, అదే ఉత్సాహంతో సమగ్ర కుటుంబ సర్వేను ప్రభుత్వ మార్గదర్శకాలను పాటిస్తూ ముందుకు వెళ్తున్నామని జిల్లా కలెక్టర్ సి నారాయణ రెడ్డి తెలిపారు. ఆదివారం ఇబ్రహీంపట్నం మండలం, ఉప్పరిగూడ గ్రామంలో జరుగుతున్న సమగ్ర కుటుంబ సర్వేను జిల్లా కలెక్టర్ నారాయణ రెడ్డి ఆకస్మికంగా తనిఖీ చేశారు. మండలంలో జరుగుతున్న సమగ్ర కుటుంబ సర్వే పనితీరు గురించి మండలం ఎంపీడీవో వెంకటమ్మను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా 5 వేల 376 ఎన్యూమరేషన్ బ్లాక్లుగా గుర్తించడం జరిగిందని తెలిపారు. ఎన్యూమరేటర్లను నియమించి సర్వే ప్రక్రియను చేపట్టడం జరిగిందని, ఎన్యూమరేటర్ల కొరత ఏర్పడకుండా, ఇంకా కొంత మంది సిబ్బందికి శిక్షణ ఇచ్చి అవసరం ఉన్న చోట ఎనిమిరేటర్లగా పంపటానికి సిబ్బందిని స్పేర్ గా ఉంచామని కలెక్టర్ తెలిపారు. ఆదివారం అయినప్పటికీ సర్వేకు ఎలాంటి ఇబ్బంది లేకుండా అన్ని బ్లాక్ లలో సర్వే ప్రక్రియ జరుగుతున్నదని అన్నారు. కుటుంబ పెద్ద తమ ఆధార్ కార్డు, రేషన్ కార్డులను అధికారులు వచ్చినప్పుడు అందుబాటులో ఉంచుకోవాలని, అదే విధంగా గ్రామ పెద్దలు, యువకులు ఈ సర్వేకు సహకరించి తోడ్పాటు అందించాలని కోరారు. సమగ్ర సమాచారం సేకరణ వలన అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రభుత్వం సంక్షేమ కార్యక్రమాలు అందించి వారికి ఏ అవసరం ఉంటుందో తెలుసుకోవడం జరుగుతుందని అన్నారు. ప్రతి ఒక్కరు ఈ సర్వేకు సహకరించాలని ఎలాంటి అపోహలకు తావివ్వకూడదని అన్నారు.

# ఇంటర్నెట్ సంతలో నిజమెంత?

**ఒకప్పటి సంగతి. మెయిల్ ఐడీ ఉండటం కూడా గొప్ప విషయం. ఆ మెయిల్‌కి ఏదైనా సందేశం వస్తే... దగ్గర్లో ఉన్న ఇంటర్నెట్ సెంటర్‌కి వెళ్లి నిమిషాల చొప్పున అద్దె చెల్లించి... బఫర్ అవుతున్న తెర వంక ఓపికగా చూడాల్సిన పరిస్థితి. కాలం మారిపోయింది. గూగుల్ తల్లి నట్టింట నాట్యమాడుతున్నది. అరచేతిలో వైకుంఠం అన్న మన పెద్దలు.. స్మార్ట్‌ఫోన్‌ని ముందే ఊహించారేమో అని అనుమానం వస్తున్నది. ఇదంతా సమాచార విప్లవమే అని మురిసిపోయే ముందు ఓ 'విష'యాన్ని దృష్టిలో ఉంచుకోవాలని సూచిస్తున్నారు నిపుణులు.**



పిల్లలకు ప్రాజెక్ట్ కావాలంటే ఇంటర్నెట్. పెద్దలకు వార్తలు తెలియాలంటే నెట్. సులువుగా సమాచారం దొరికే ఆ సంతలో... కనిపించేదంతా నిజం కాదట. దీనికి 1% రూల్ అనే సిద్ధాంతం కూడా ఉంది. అంటే ఇంటర్నెట్‌లో దొరికే సమాచారాన్ని కేవలం ఒక్క శాతం మంది సృష్టిస్తే, దాన్ని 99 శాతం మంది గుడ్డిగా నమ్మేస్తారని ఈ సిద్ధాంతం చెబుతున్నది. ఓ ఇరవై ఏళ్ల క్రితం, ఇంటర్నెట్ తీరుతెన్నులను గమనించిన ఇద్దరు బ్లాగర్లు రూపొందించిన సిద్ధాంతం ఇది. ఈ థియరీకి కాస్త వైవిధ్యం జోడించిన మరో మాట 1990 రూల్. అంటే ఒక్క శాతం వ్యక్తులు సమాచారాన్ని వదిలితే, మరో తొమ్మిది శాతం దానికి మార్పులూ చేర్పులూ చేస్తారనీ... మిగతా 90 శాతం దాన్ని విశ్వసిస్తారనీ దీనర్థం. ఈ సూత్రం నిజమా, కాదా! అని నిర్ధారించుకునేందుకు చాలా పరిశోధనలే జరిగాయి. అతివాదం నుంచి ఆరోగ్యం మీద దుష్ప్రచారం వరకూ చాలా సందర్భాలలో ప్రజలు తప్పుదోవ పట్టేందుకు ఈ 1% రూల్ కారణం అని తేలింది. ఉదాహరణకు 2007లో జరిగిన ఓ పరిశోధనలో కొన్ని మత ఛాందస వెబ్‌సైట్లను పరిశీలించినప్పుడు... వాటిలో ఒక్క శాతం మందే తరచూ పోస్ట్ చేస్తున్నారనీ. 13 శాతం మంది అప్పుడప్పుడూ పోస్ట్ చేస్తుండగా, ఏకంగా 86 శాతం మంది పోస్ట్ చేయడం అనే ఆలోచనే లేకుండా, చర్చలే చేయకుండా... అక్కడ ఉన్నవాటిని అనుసరిస్తున్నారనీ తేలింది. అప్పుడే అలా ఉంటే.. ఇప్పుడు పరిస్థితి మరింత దిగజారిందని చెప్పకతప్పదు.

## దూరం... దూరం!

కొందరి మాటలు అందరూ వినడం అనేది పార్టిసిపేషన్ ఇనీక్వాలిటీ అనే సమస్యకు దారితీస్తుంది. న్యూనత వల్లో, జంకుతోనో, ఎవరేమనుకుంటారనే భయంతోనో, తనది తప్పవుతుందనే అనుమానం కారణంగానో.. మాట వినిపించాల్సిన సందర్భంలో మౌనంగా ఉండిపోవడమే ఈ సమస్య. ఇందుకు వికీపీడియాను ఉదాహరణగా తీసుకోవచ్చు. అందులో సమాచారాన్ని సరిదిద్దే అవకాశం అందరికీ ఉన్నా కూడా, కొందరే ఆ చొరవ చూపిస్తారు. జీమెయిల్, జూమ్ లాంటి వేదికల మీద జరిగే చర్చావేదికలలోనూ ఇదే పరిస్థితి. ఓ పదిమంది తమ మాటను వినిపిస్తే... మిగతా 90 మంది వేడుకను చూసేందుకు సిద్ధపడిపోతారు. వెబ్‌సైట్లను సామాన్యులకు చేరువ చేయడంలో అద్భుతాలు సృష్టించాడని చెప్పుకొనే జాకబ్ నీల్సన్ అనే శాస్త్రవేత్త ఈ ప్రతిపాదన చేయడం గమనార్హం. సోషల్ మీడియాలో తెగ యాక్టివ్‌గా ఉండే ఈ తరం ఇంటర్నెట్‌లో ఉన్న నకిలీ కంటెంట్ మీద మాత్రం నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరిస్తుండటం బాధాకరం. పొలిటీషియన్లు, సెలెబ్రిటీలు నోరుజారితే ట్రోల్స్‌తో రెచ్చిపోయే యంగిస్థాన్‌లు.. ఫేక్ న్యూస్‌పై స్పందించడంపై మాత్రం చొరవ చూపడం లేదు. 'నిజం నిద్రలేచేలోగా.. అబద్ధం ఊరంతా తిరిగొస్తుంద'న్న తాతల నాటి సామెత నేటికీ పచ్చిగానే ఉందని ఇంటర్నెట్ నిరూపిస్తున్నది. గతంలో అబద్ధం ఊరిలోనే తిరిగేది.. ఇప్పుడు నిజమేంటో తెలిసేలోగా ప్రపంచాన్నే చుట్టేస్తుండటం విడ్డూరం!

### కొన్ని జాగ్రత్తలు అవసరం

- ఏదైనా సమాచారం కలవరపెట్టినప్పుడు, విశ్వసనీయమైన వెబ్‌సైట్ల ద్వారా అది నిజమా, కాదా! అని నిర్ధారించుకోవాలి.
- వాట్సాప్ గ్రూపులలో వచ్చిన వార్త తప్పు అని కచ్చితంగా తెలిస్తే, అది ఫేక్ అని నిర్మొహమాటంగా వెల్లడించాలి.
- కొన్ని సైట్ల తీరును చూడగానే వాటి ఉద్దేశాలు, పక్షపాతాలు స్పష్టంగా కనిపిస్తాయి. అలాంటివాటి జోలికి పోకపోవడమే మంచిది.
- వికీపీడియా లాంటి సైట్లలో సమాచారాన్ని వెతికేటప్పుడు, వాటికి అనుబంధంగా ఇచ్చిన లింక్స్ ద్వారా ఆ వార్త కచ్చితత్వాన్ని తెలుసుకునే ప్రయత్నం చేయాలి.
- చాలా సందర్భాలలో పాతబడిన సమాచారం పదేపదే తిరుగుతుంటుంది. అందుకే వార్త పైన తేదీ, రచయిత, సోర్స్ లాంటి వివరాలు గమనించడం కీలకం.
- ఈ కృత్రిమ మేధ కాలంలో నిజమైన సమాచారానికి మరింత గడ్డు కాలం రానుంది. పదాలే కాదు వాటిని పలికే స్వరాలు... ఆ స్వరానికి మూలమైన మనుషులను కూడా నమ్మే పరిస్థితులు లేవు. కాబట్టి సమాచారాన్ని సేకరించేటప్పుడు, దాన్ని ఇతరులతో పంచుకునేటప్పుడు మరింత జాగ్రత్తగా ఉండాల్సిందే!





# తెలుగు కవితకే కీర్తి

## శ్రీశ్రీ మహా ప్రస్థానం

శ్రీశ్రీ మహాప్రస్థానం ఏ తరానికైనా ఏ కాలానికైనా స్ఫూర్తి. "ఎముకలు కుళ్ళిన వయసు మళ్ళిన సోమరులారా చావండి అంటూ యువతలోని ఆవేదనను ఆవేశంగా చెప్పిన శ్రీశ్రీ భావావేశంతో వెలుగులు పంచారు. ఆయన సాహిత్యం చిరంజీవి. నిత్యస్ఫూర్తి. కుదిరితే నడవు.. లేకుంటే పరుగెత్తు ఆయన కలం నింపిన స్ఫూర్తి ఎన్నో వేల జీవితాలకు వెలుగైంది. శ్రీశ్రీ మహా ప్రస్థానంలో .. కొత్త ప్రపంచాన్ని ఆవిష్కరించారు. స్ఫూర్తినింపారు. భవిష్యత్తుపై ఆశ కలిగించారు. రగిలించారు. బాధ్యత గుర్తుచేశారు. ధైర్యం నూరిపోశారు. శక్తినింపారు. అందుకే ఎందరో మహానుభావులున్నా.. ఎన్నో అద్భుత రచనలున్నా శ్రీశ్రీ మహాప్రస్థానం ఇప్పటికీ, ఎప్పటికీ ఎవర్ గ్రీన్. తెలుగుకవితకే శ్రీశ్రీ మార్గదర్శి. మహాప్రస్థానం గేయాల్లోని ఇతివృత్తాలు ప్రధానంగా ప్రపంచవ్యాప్తంగా మానవజాతి ఎదుర్కొంటున్న బాధలు, వీటికి నేపథ్యంగా ఉన్న చారిత్రిక పరిణామాలు, పీడితుల పక్షాన నిలవాల్సిన కవికి అవసరమైన లక్షణాలు, నూతనమైన ఈ అంశాలపై రావాల్సిన కవిత్వమూ, తన కవిత్వానికి లక్షణాలు, పీడితులను ఇంకా పీడించేందుకు సహాయకారిగా ఉండే అంశాలు, పరిస్థితులపై తిరుగుబాటు వంటివి ఉన్నాయి. తెలుగు కవిత్వాన్ని మరో మలుపు తిప్పిన శ్రీశ్రీ "మహాప్రస్థానం"1950లో పుస్తకరూపం ధరించగా, ఏడున్నర దశాబ్దాలైనా ఇప్పటికీ నిత్య నూతనంగా నిద్రలేపుతోంది. మత్తు వదిలిస్తోంది.

మరో ప్రపంచం,
మరో ప్రపంచం,
మరో ప్రపంచం పిలిచింది!
పదండి ముందుకు,
పదండి తోసుకు!
పోదాం, పోదాం, పైపైకి!
......................................

#జయభేరి
నేను సైతం
ప్రపంచాగ్నికి
సమిధ నొక్కటి ఆహుతిచ్చాను!
నేను సైతం
విశ్వవృష్టికి
అశ్రు వొక్కటి ధార పోశాను!
......................................

నేను సైతం
భువన ఘోషకు
వెర్రి గొంతు విచ్చి మ్రోశాను!
......................................

#బుక్కలు
కుక్క పిల్ల,
అగ్గిపుల్ల,
సబ్బు పిల్ల
హీనంగా చూడకు దేన్నీ!
కవితామయమేనోయ్ అన్నీ!
......................................

#బాటసారి
కూటికోసం, కూలికోసం
పట్టణంలో బ్రతుకుదామని
తల్లి మాటలు చెవిని పెట్టక
బయలుదేరిన బాటసారికి,
మూడురోజులు ఒక్కతీరుగ
నడుస్తున్నా దిక్కు తెలియక
నడి సముద్రపు నావ రీతిగ
సంచరిస్తూ, సంచలిస్తూ,
దిగులు పడుతూ, దీనుడౌతూ
తిరుగుతుంటే
చండ చండం, తీవ్ర తీవ్రం
జ్వరం కాస్తే,
భయం వేస్తే,
ప్రలాపిస్తే
మబ్బుపట్టీ, గాలికొట్టీ,
వానవస్తే, వరదవస్తే,
చిమ్మ చీకటి క్రమ్ముకొస్తే
దారి తప్పిన బాటసారికి
ఎంత కష్టం?
......................................

#మిద్యావాది
మాయంటావా? అంతా
మిథ్యంటావా?
నా ముద్దుల వేదాంతీ!
ఏం మంటావు?
మాయంటావూ? లోకం
మిథ్యంటావూ?
......................................

కనబడినది కనబడదని
వినబడినది వినబడదని
జగతి మరుపు, స్వప్నం, నిశ్శబ్దం, ఇది
మాయ! మాయ!
మాయంటావూ? అంతా
మిథ్యంటావూ?
......................................

#ప్రతిజ్ఞ
నరాల బిగువూ,
కరాల సత్తువ
వరాలవర్షం కురిపించాలని,
ప్రపంచ భాగ్యం వర్ధిల్లాలని
గనిలో, వనిలో, కార్ఖానాలో
పరిక్లమిస్తూ
పరిప్లవిస్తూ,
ధనికస్వామికి దాస్యం చేసే,
యంత్రభూతముల కోరలు తోమే,
కార్మిక వీరుల కన్నుల నిండా
కణకణ మండే,
గలగల తొణకే
విలాపాగ్నులకు, విషాదాశ్రులకు
ఖరీదుకట్టే షరాబు లేడోయ్!
......................................

#చేదుపాట
లేదు సుఖం, లేదు సుఖం
లేదు సుఖం జగత్తులో!
బ్రతుకు వృథా, చదువు వృథా!
కవిత వృథా! వృథా, వృథా!
......................................

మనమంతా బానిసలం,
గానుగలం, పీనుగులం!
వెనుక దగా, ముందు దగా,
కుడి యెడమల దగా, దగా!
......................................

మనదీ ఒక బ్రదుకేనా?
కుక్కలవలె, నక్కలవలె!
మనదీ ఒక బ్రదుకేనా?
సందులలో పందులవలె!
......................................

ఏ దేశచరిత్ర చూచినా
ఏమున్నది గర్వకారణం?
నరజాతి చరిత్ర సమస్తం
పరపీడన పరాయణత్వం.

#మానవుడా
ఆలోచనలు పోయేవాడా!
అనునిత్యం అన్వేషించేవాడా!
చెట్టూ, చెరువూ, గట్టూ, పుట్టా
ఆకసంలో, సముద్రంలో
అన్వేషించేవాడా!
......................................

అశాంతుడా! పరాజయం ఎరుగనివాడా!
ఊర్ధ్వదృష్టీ! మహామహుడా!
మహాప్రయాణికుడా!
మానవుడా! మానవుడా!
......................................

కాట్లాడుకునేవాడా!
ఓర్వలేనివాడా!
సంకుచిత స్వభావుడా!
అయ్యో! మానవుడా!
......................................

#సంధ్యాసమస్యలు
ఉడిపీ శ్రీకృష్ణ విలాస్ లో
అటు చూస్తే బాదం హల్వా,
ఇటు చూస్తే సేమ్యా ఇడ్లీ!
ఎంచుకొనే సమస్య కలిగిందొక ఉద్యోగికి!
......................................

ఆ సాయంత్రం...
ఇటు చూస్తే అప్పులవాళ్లూ,
అటు చూస్తే బిడ్డల ఆకలి!
ఉరిపోసుకు చనిపోవడమో,
సముద్రమున పడిపోవడమో
సమస్యగా ఘనీభవించిందొక సంసారానికి!
......................................

#పేదలు
అంతేలే, పేదల గుండెలు!
అశ్రువులే నిండిన కుండలు!
శ్మశానమున శశికాంతులలో
చలిబారిన వెలి రాబండలు!
......................................

అంతేలే, పేదల మూపులు!
అణగార్చగ విధి త్రోద్రోపులు!
పయోధితట కుటీరములవలె
భరియించవు బాధల మోపులు!
......................................

అంతేలే, పేదల చేతులు!
శ్లథశైశిర పలాశ రీతులు!
విశుష్కములు, పరిపాండురములు
హవిచలించెడి విషాద హేతులు!
......................................

#జగన్నాథునిరథచక్రాలు
పతితులారా!
భ్రష్టులార!
బాధాసర్ప దష్టులార!
......................................

అత్యద్భుత భావావేశం, అత్యాధునిక కవితావేశం, అత్యున్నత సామ్యవాద విప్లవ సందేశం ఒకే వ్యక్తిలో త్రివేణీ సంగమైమై సరికొత్త సాహిత్య చరిత్రని సృష్టించిన మహాకవి శ్రీశ్రీ తన కాలపు సమకాలికుల్లో అగ్రగణ్య ఆధునిక మహాకవిగా కీర్తి శిఖరాల నధిరోహించటమే కాక ఆధునిక తెలుగు సాహిత్యానికి కూడా ఘనకీర్తి సాధించి పెట్టారు. ఈ మహా ప్రస్థానం ఎప్పటికీ స్ఫూర్తి. తెలుగు కీర్తి.

## సాహిత్యం-సందర్భం

ప్రతీ సోమవారం ప్రచురితమయ్యే సాహితీ సందర్భం పేజీకి సాహితీ వ్యాసాలు, కవితలు, కథాకవిత సంకలనాల సమీక్షలు, అభిప్రాయాలు పంపండి. ప్రతీరోజు ప్రచురితమయ్యే ఎడిట్ పేజీకి దేశ, రాష్ట్ర రాజకీయాలు, అంతర్జాతీయ పరిణామాలు, ప్రభుత్వాల తీరుతెన్నులు, వివిధ రంగాలపై విశ్లేషణలు, వ్యాసాలు, అభిప్రాయాలు పంపండి. తాజా అంశాలకు ప్రాధాన్యముంటుంది.

మీ రచనలు పంపాల్సిన చిరునామా: editor@mahaadaily.com

# నేడు ములుగులో కేంద్రమంత్రి బండి సంజయ్ పర్యటన

## జిల్లా కలెక్టర్ దివాకర టి. ఎస్.



**ములుగు జిల్లా ప్రతినిధి, నవంబర్ 10, మహా:** ములుగు జిల్లా కలెక్టరేట్ కార్యాలయ సమావేశ మందిరంలో కన్నాయిగూడెం మండలం ఆస్పిరేషనల్ బ్లాక్ కార్యక్రమంపై నిర్వహించే సమావేశానికి కేంద్ర హోంమంత్రి బండి సంజయ్ కుమార్ హాజరు కానున్నారని ఓ ప్రకటనలో జిల్లా కలెక్టర్ దివాకర టి. ఎస్. తెలిపారు. అనంతరం కేంద్ర మంత్రి వెంకటాపూర్ మండలంలోని నంది పహాడ్ గ్రామాన్ని సందర్శించి, అక్కడి నుంచి ములుగు చేరుకుని, భూపాలపల్లి జిల్లాకు బయలుదేరుతారని ఆయన తెలిపారు. కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ నిర్వహించనున్న సమీక్షా సమావేశానికి ఉదయం 10.30 గంటలకు కలెక్టరేట్ సమావేశ మందిరంలో అధికారులందరూ సంబంధిత సమాచారం తోపాటు తప్పనిసరిగా హాజరుకావాల్సిందిగా కలెక్టర్ ఆదేశించారు.

**వీడియో సమావేశ హాలులో నేడు ప్రజావాణి**

ప్రజా సమస్యల పరిష్కారం కోసం ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమాన్ని నేడు కలెక్టరేట్ వీడియో సమావేశ మందిరంలో నిర్వహించనున్నామని జిల్లా కలెక్టర్ దివాకర టి. ఎస్. ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతి సోమవారం ప్రజావాణి కార్యక్రమం సమావేశ మందిరంలో కొనసాగుతుందని, అయితే, కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ ఆ సమావేశ మందిరంలో అధికారులతో సమావేశం నిర్వహించనున్న నేపథ్యంలో నేడు నిర్వహించనున్న ప్రజావాణి కార్యక్రమాన్ని వీడియో సమావేశ మందిరానికి మార్చినట్లు ఆయన స్పష్టం చేశారు.





# ఇల్లందులో పర్యటించిన సింగరేణి డైరెక్టర్

**ఇల్లందు, నవంబర్ 10, మహా:** ఇల్లందు ఏరియాలో ఆదివారం సింగరేణి డైరెక్టర్ జి. వెంకటేశ్వరరెడ్డి విస్తృతంగా పర్యటించారు. కేఓసీ, జేకే ఓసీలో జరుగుతున్న పనుల వివరాలను ఏరియా జీఎం జాన్ ఆనంద్ ను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఓసీ పని స్థలాలను సందర్శించి అక్కడ జరుగుచున్న పనులు, రోజు వారీ బొగ్గు ఉత్పత్తి, రవాణా, ఓబీ బ్లాస్టింగ్, లోడింగ్ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బొగ్గు ఉత్పత్తి, రవాణా రోజు వారీ లక్ష్యాలను అధిగమించాలని, అంతేకాకుండా రక్షణతో కూడిన ఉత్పత్తి తీయాలని, సంస్థ నిర్దేశించిన వార్షిక లక్ష్యాలను అధిగమించాలన్నారు. నూతన జేకే ఉపరితల గని ప్రారంభించబడే స్థలాన్ని పరిశీలించారు. అనంతరం జనరల్ మేనేజర్ కార్యాలయంలో ఏరియా గనులు, విభాగాల అధిపతులతో నూతన జేకే ఓసి పనుల పురోగతిపై సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో నూతన జేకే ఉపరితల గనికి సంబంధించి మొదటి దశ అనుమతులు వచ్చాయని, తదుపరి అనుమతుల కోసం చేయాల్సిన పనుల వివరాలను అధికారులకు తెలియజేస్తూ తగు సలహాలు, సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో జీఎం (సీపీపీ) ఎ. మనోహర్, జీఎం (పీపీ) కె. సాయిబాబు, జీఎం (హెచ్.ఆర్.డి ) ఇ. కృష్ణయ్య, ఎస్ఓటూ జీఎం బొల్లం వెంకటేశ్వర్లు, ఏజీఎం (ఐఈ) గిరిధర్ రావు, ఏరియా ఇంజనీర్ నరసింహ రాజు, ప్రాజెక్ట్ ఆఫీసర్స్ కృష్ణ మోహన్, రామస్వామి, డీజీఎం (పీపీ) మధర్, డీజీఎం (పర్సనల్) మోహన్ రావు, డీజీఎం (సర్వే) బాలాజీ నాయుడు, డీజీఎం (సివిల్) రవికుమార్, మేనేజర్లు సౌరబ్ సుమన్, పూర్ణ చందర్, అధికారులు నాగరాజు నాయక్, దిలీప్ కుమార్, మహేష్, అంజిరెడ్డి, శివకుమార్, యాస శ్రీనివాస్ పాల్గొన్నారు.



# ఖమ్మంలో పర్యటించిన మాజీ మంత్రి పువ్వాడ

**ఖమ్మం సిటీ, నవంబర్ 10, మహా:** ఖమ్మం నగరంలో మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ పర్యటించి పలు కుటుంబాలను పరామర్శించారు. ప్రముఖ డాక్టర్ ఎస్. వెంకటేశ్వరరావు సతీమణి రమాదేవి ఇటీవల మరణించగా ఆమె చిత్రపటానికి నివాళులు అర్పించి, కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఖమ్మం బ్యాంకు కాలనీకి చెందిన పాటిబండ్ల సుదర్శన్ తల్లి రాణి ప్రమీల ఇటీవల మరణించగా ఆమెకు కూడా నివాళులు అర్పించారు. ఇందిరా నాగర్ నందు బీఆర్ఎస్ మహిళా నాయకురాలు ఊర్మిళ తల్లి సౌభాగ్య ఇటీవల మృతిచెందగా ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించి, వారి కుటుంబాన్ని పర్మర్శించారు. ఈ కార్యక్రమంలో నగర అధ్యక్షులు పగడాల నాగరాజు, టేకులపల్లి సొసైటీ చైర్మన్ బీరెడ్డి నాగచంద్రా రెడ్డి, మాజీ సుడా చైర్మన్ బచ్చు విజయ్ కుమార్, కార్పొరేటర్లు మొతారపు శ్రావణి సుధాకర్, నాయకులు బుర్రి వినయ్ కుమార్, ప్రచార కార్యదర్శి షకీనా, వంగవీటి శ్రీను, పాషా, ఉస్మాన్, చారి, జగదీష్, కిషోర్, ప్రాన్సిస్ తదితరులు పాల్గొన్నారు.

# రామప్ప దేవాలయాన్ని సందర్శించిన హైకోర్టు న్యాయమూర్తి



**ములుగు జిల్లా ప్రతినిధి, నవంబర్ 10, మహా:** వెంకటాపూర్ మండలం పాలంపేటలో గల ప్రపంచ వారసత్వ కట్టడమైన రామప్ప దేవాలయాన్ని ఆదివారం హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సుజయ్ పాల్ దంపతులు సందర్శించారు. ఈ సందర్భంగా ములుగు జిల్లా జడ్జి ఎస్. వి. పి.సూర్యచంద్ర కళ, సీనియర్ సివిల్ జడ్జి కన్నయ్య లాల్, అదనపు సివిల్ జడ్జి జె. సౌఖ్య , జిల్లా ఎస్పీ శబరీష్ లు పుష్పగుచ్ఛాలు అందించి స్వాగతం పలికారు. ఆలయ అర్చకులు కోమల్లపల్లి హరీష్ శర్మ, మోహన మఠం ఉమాశంకర్లు పూర్ణకుంభంతో స్వాగతం పలికి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ మహా మండపంలో వారిని శాలువాలతో సన్మానించి మహా ఆశీర్వచనం అందజేశారు. ఆలయ ప్రాముఖ్యతను టూరిజం గైడ్ గోరంట్ల విజయ్ కుమార్ వివరించారు. అనంతరం హైకోర్టు న్యాయమూర్తి మాట్లాడుతూ రామప్ప దేవాలయం మహా అద్భుత కట్టడమని, 800 సంవత్సరాల క్రితమే అత్యద్భుతమైన టెక్నాలజీతో నిర్మించారన్నారు. నీళ్లలో తేలే ఇటుకలు సాండ్ బాక్స్ టెక్నాలజీ, గర్భగుడిలోని లైటింగ్.. ప్రతిదీ అత్యాద్భుతమని కొనియాడారు. ఇప్పటికంటే నాడే అడ్వాన్స్ టెక్నాలజీ ఆధునికత ఉండడానికి అప్పటి హై హీల్స్ మినీస్ కార్డ్స్ ఇక్కడ రాయిలో సరిగమలు సూక్ష్మ రంధ్రాలు నిదర్శనం అని అన్నారు. అనంతరం రామప్ప చెరువును సందర్శించి బోటింగ్ చేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి సీహెచ్. పంచాక్షరి, హన్మకొండ జిల్లా ప్రధాన న్యాయ మూర్తి సీహెచ్. రమేష్ బాబు, వరంగల్ జిల్లా ప్రధాన న్యాయమూర్తి బి.వి. నిర్మల గీతంబ, ఆర్డీఓ వెంకటేష్, డీఎస్పీ రవీందర్, సీఐ శంకర్, బార్ అసోసియేషన్ అధ్యక్షులు ఎమ్. వినయ్ కుమార్, జనరల్ సెక్రెటరీ కె. సునీల్ కుమార్, ఎస్సై సతీష్, తహాశీల్దార్ సదానందం, ఆర్ఐ రమేష్, న్యాయవాదులు, పోలీసు అధికారులు, రెవెన్యూ అధికారులు, కోర్టు సిబ్బంది, టూరిజం దేవాదాయ పురావస్తు శాఖ సిబ్బంది, తదితరులు ఉన్నారు.

## వన సమారాధనలో పాల్గొన్న ఎమ్మెల్యే రాగమయి



**సత్తుపల్లి, నవంబర్ 10, మహా:** మండల పరిధిలోనికి కిష్టారం గ్రామంలో అఖిల గాండ్ల తెలీల సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన కార్తీకమాస వన సమారాధన కార్యక్రమానికి నియోజకవర్గ ఎమ్మెల్యే మట్టా రాగమయి దయానంద్, రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు దయానంద్ విజయకుమార్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతి ఏటా కార్తీక మాసంలో జరుపుకునే వన సమారాధన కార్యక్రమం మనిషి రద్దీ జీవితం నుండి ఉపశమనం కలిగేలా దోహదపడుతుందని, ఎన్ని కార్యక్రమాలు ఉన్నా ఒక్కరోజు కుటుంబంతో వనాల్లో చేరి ఆటపాటలతో అన్నపానీయాలతో ఆహ్లాదకరంగా గడపటం శుభ పరిణామం అన్నారు. అన్ని వయసుల వారు ఆహ్లాదకరంగా ఉన్న ఈ వేడుకకు తమను ఆహ్వానించడం సంతోషాన్ని ఇచ్చిందన్నారు. ఈ కార్యక్రమంలో కిష్టారం గ్రామస్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# ఢిల్లీ ప్రభుత్వ విధానాలను తెలంగాణలో అమలు చేయాలి



## నల్లమోతు తిరుమలరావు

**నేలకొండపల్లి, నవంబర్ 10, మహా:** పేదలకు ఢిల్లీ ప్రభుత్వం అందిస్తున్న వైద్య సేవలను తెలంగాణ ప్రభుత్వం అందించాలని ఆమ్ ఆద్మీ రాష్ట్ర కోర్ కమిటీ సభ్యులు నల్లమోతు తిరుమలరావు డిమాండ్ చేశారు. పాలేరు ఇంచార్జీ పసుమర్తి శ్రీనివాస్ పట్టణంలో పెట్రోల్ బంక్స్, హోటల్స్ తోపాటు తదితర చోట్ల కూలీపనులు చేయటంతోపాటు, దాతల నుంచి సేకరించిన రూ. 50 వేల విలువైన అత్యవసర మందులను ఆదివారం స్థానిక పీహెచ్ సీకి అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. విద్యా, వైద్యానికి రోల్ మోడల్ కేజీవాల్ అని అన్నారు. సామాన్యులకు నాణ్యమైన ఉచిత విద్య, వైద్యాన్ని అందిస్తున్న ఢిల్లీ ప్రభుత్వం తరహాలోనే సేవలు అందించాలని కోరారు. స్థానిక ప్రభుత్వ హాస్పిటల్ లో మందుల కొరత కారణంగా స్థానిక నాయకులు పసుమరి శ్రీనివాస్ దాతలు, పార్టీ నాయకుల నుంచి దాదాపు రూ. 50 వేల విలువైన మందులను సేకరించటం సంతోషించదగ్గ విషయమన్నారు. కేజ్రీవాల్ మోడల్ దేశానికి ఆదర్శం అన్నారు. నాణ్యమైన విద్య, వైద్యంను అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు స్వర్ణ సుబ్బారావు, సూర్యదేవర సంగమేశ్వరప్రసాద్, పాలేరు ఇంచార్జీ పసుమర్తి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## 16 నుంచి క్రీడా పోటీలు

**ఖమ్మం సిటీ, నవంబర్ 10, మహా:** ఈనెల 16, 17 తేదీల్లో ఖమ్మం పటేల్ స్టేడియంలో 'ఈశా గ్రామోత్సవం' పేరిట పురుషులకు వాలీబాల్, మహిళలకు త్రోబాల్ పోటీలు నిర్వహించనున్నామని సంస్థ ప్రతినిధులు తెలిపారు. 14 ఏళ్ల వయసు పైబడినవారు పోటీల్లో పాల్గొనవచ్చని, ప్రవేశం ఉచితమని చెప్పారు. ముందుగా పేర్లు నమోదు చేయించుకోవాలనుకునేవారు సెల్ నెంబర్. 9849627887కు సంప్రదించాలన్నారు.

# సమగ్ర ఇంటింటి సర్వేను పగడ్బందీగా నిర్వహించాలి

## జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్



**భద్రాద్రి కొత్తగూడెం బ్యూరో, నవంబర్ 10, మహా:** సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేను పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ ఆదివారం ఎన్యూమరేటర్లను ఆదేశించారు. పాల్వంచ మున్సిపాలిటీ పరిధిలోని బొల్లోరి గూడెం 11 వ వార్డులో పర్యటించి సమగ్ర కుటుంబ ఇంటింటి సర్వేను పర్యవేక్షించి వివరాల సేకరణలో ఏమైనా ఇబ్బందులు కలుగుతున్నాయా ? అని ఎన్యూమరేటర్లను అడిగి తెలుసుకున్నారు. ఏమైనా ఇబ్బందులు ఉంటే సూపర్ వైజర్లకు మరియు ప్రత్యేక అధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సర్వేలో భాగంగా ఈనెల 6 నుంచి 8వ తేదీ వరకు ఇంటింటికి స్టిక్కరింగ్ వేయడం పూర్తి చేశామన్నారు. శనివారం నుండి ప్రభుత్వం నిర్దేశించిన ఫారంలో సామాజిక, ఆర్థిక, విద్య, ఉద్యోగ, ఉపాధి, రాజకీయ మరియు కుల వివరాలను ప్రతి కుటుంబం నుంచి సేకరించి నమోదు చేయడం జరుగుతుందని అన్నారు. దాదాపు 57కు పైగా అంశాలలో వివరాలను నమోదు చేయవలసి ఉన్నందున ఎన్యూమరేటర్ కు ఒక సహాయకులను నియమించుకుంటే బాగుంటదని సూచించారు. ప్రతి ఒక్క బ్లాక్ కు ఒక ప్రత్యేక ఎన్యూమరేటర్ ఉండేలా జాగ్రత్తగా తీసుకోవాలని అన్నారు. అన్ని స్థాయిల స్పెషల్ ఆఫీసర్లు క్షేత్రస్థాయిలో తిరుగుతూ సర్వేలో ఏమైనా ఇబ్బందులు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని అన్నారు. నమోదు చేసిన వివరాలను గోప్యంగా ఉంచాలన్నారు. నమోదు చేసిన వివరాలను ప్రతి ఎన్యూమరేటర్ వారికి కేటాయించిన కేంద్రాలలో డేటా ఎంట్రీ సిబ్బంది ద్వారా ఎటువంటి పొరపాటు లేకుండా ఆన్ లైన్ లో నిర్దిష్ట సమయంలో నమోదు చేయించాలన్నారు. ఈ సర్వే వలన ప్రభుత్వ పథకాలను మరింత సమర్థవంతంగా రూపొందించడానికి మార్గం సుగమమం అవుతున్నందున ప్రతి ఒక్కరూ ఆధార్ కార్డు, రేషన్ కార్డు, పట్టాదారు పాస్ పుస్తకం తదితర వివరాలను తమ వద్ద ఉంచుకొని సర్వే కోసం వచ్చే ఎన్యూమరేటర్లకు అందించి వివరాలను నమోదు చేయించుకోవాలని ఈ సందర్భంగా ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

# నూతన వధూవరులను ఆశీర్వదించిన మందకృష్ణ మాదిగ



**బోనకల్, నవంబర్ 10, మహా:** మండల కేంద్రంలో మరీదు కృష్ణయ్య నాగమ్మ దంపతుల కుమారుడు గురుదత్తు ఏలూరు జిల్లా నూజివీడు మండలం సుంకొల్లు గ్రామ వాస్తవ్యులు కొనకాల నాగమల్లేశ్వరరావు చెన్నకృష్ణమ్మ దంపతుల కనిష్ట పుత్రిక లీనారాయ్ తో ఘనంగా వివాహం జరిగింది. ఈ వివాహ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మందకృష్ణ మాదిగ హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షులు కూరపాటి సునీల్ మాదిగ, మాజీ జెడ్పీటీసీ, బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు బానోతు కొండ, ఎంఎస్పీ డివిజన్ నాయకులు కోట హనుమంతరావు, సీనియర్ నాయకులు తాటికొండ వెంకటరత్నం, ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షులు తోటపల్లి సైదులు, ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకులు మంద అశోక్, తేళ్లూరి రమేష్, అంతోటి ముత్తుస్వామి, ఇరుగు పుల్లారావు, మంద గురునాధరావు పాల్గొన్నారు.

# పోరాటాలకు సిద్ధం కావాలి

## సీపీఎం జిల్లా కార్యదర్శి నాగేశ్వరరావు




**ఖమ్మం సిటీ, నవంబర్ 10, మహా:** ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి నాగేశ్వర రావు అన్నారు. ఆదివారం సీపీఎం పార్టీ వన్ టౌన్ మహాసభల ప్రారంభ సూచికంగా అరుణ పతాకాన్ని పార్టీ సీనియర్ నాయకులు కామ్రేడ్ వంజాకు లక్ష్మీనారాయణ ఆవిష్కరించారు. జాతీయ కార్యదర్శి చిత్రపటానికి నున్న నాగేశ్వరరావు పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం షేక్ బేగం, చిన్న శ్రీనివాస్, కురపాటి శ్రీను అధ్యక్షతన జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో అధికారంలో ఉన్న ప్రభుత్వం పది నెలలు గడుస్తున్నా అమలు చేయాల్సిన ఆరు గ్యారెంటీలను అమలు చేయడంలేదన్నారు. పేదలకు గృహ నిర్మాణ పథకం, వితంతువులు, వృద్ధులు వికలాంగులు పెన్షన్ల పెంపుదల ఊసే లేదన్నారు. డబుల్ బెడ్ రూమ్, దళిత బంధు, ఇతర సంక్షేమ పథకాలు అమలు వైఫల్యం వల్లే కేసీఆర్ ప్రభుత్వాన్ని ఎన్నికల్లో ఓడించారని, అయితే, కాంగ్రెస్ ప్రభుత్వం కూడా పేదలకు ప్రాధాన్యత ఇవ్వడంలేదన్నారు. క్షేత్రస్థాయిలో ప్రజా సమస్యలను గుర్తించి ప్రజలను కదిలించి పోరాటాలకు సిద్ధం కావాలని అన్నారు. అనంతరం సీపీఎం వన్ టౌన్ కార్యదర్శి ఎంఏ జబ్బార్ నివేదికను ప్రవేశపెట్టారు. ఈ కార్యక్రమంలో సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యులు యర్రా శ్రీకాంత్, మున్సిపల్ మాజీ చైర్పర్సన్ అఫ్రోజ్ సమీనా, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కళ్యాణం వెంకటేశ్వర రావు, వై. విక్రం, జిల్లా కమిటీ సభ్యులు ఎంఏ జబ్బార్, ఎస్. నవీన్ రెడ్డి, తిరుపతి రావు, యర్రా శ్రీనివాస్, మీరా సాహెబ్, విష్ణు వర్ధన్, బషీరుద్దీన్, ఉపేందర్, నాయకులు మోటమర్రి జగన్మోహన్రావు, ఏఎస్ కుమార్, యాదగిరి, గట్టగిరి, నాగరాజు, కిరణ్ తదితరులు పాల్గొన్నారు. 22 మందితో నూతన మండల కమిటీని ఏర్పాటు చేశారు. సీపీఎం వన్ టౌన్ కార్యదర్శిగా షేక్, నాగుల మీరా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

## ఏఐఎస్టీఈఏ జాతీయ కార్యవర్గ సభ్యులుగా ఖమ్మం వాసులు నియామకం




**ఖమ్మం సిటీ, నవంబర్ 10, మహా:** అఖిల భారత గిరిజన ఉద్యోగుల సంఘం ఖమ్మం జిల్లా ప్రధాన కార్యదర్శిగా భూక్యా శోభన్ నాయక్ ఎన్నికయ్యారు. వీరికి ఏఐఎస్టీఈఏ జాతీయ అధ్యక్షులు పీవీ రమణ, జిల్లా అధ్యక్షులు గరిక శ్రీనివాస్, జిల్లా కార్యనిర్వాహక అధ్యక్షులు ఆరేం చంద్రయ్య, జిల్లా ఆడిట్ కన్వీనర్ పుట్టబంతి బాలస్వామి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బి. మంగ్యా నాయక్, గౌరవ అధ్యక్షులు డాక్టర్ బి.శంకర్ నాయక్, జిల్లా మహిళ ఉపాధ్యక్షురాలు రాధా సీఐ, జిల్లా నాయకులు ఎన్. శివ కోటి , జె. వీరన్న, పుట్టబంతి శ్రీనివాస్, బి. ముత్తయ్య, ఎం. రఘు, డి. శ్రీనివాస్, జి. సాంబశివరావు, పి. నాగేశ్ రావు, ఎం. నాగప్రసాద్, ఎ. రాంబాబు, డి. రాములు నాయక్, రావూరి రాజు, ఎ. రాంబాబు, బి. బాలాజీ, ఎ. ఇసాక్, బి. దేవానాయక్ తదితరులు అభినందనలు తెలిపారు.



## సీపీఎం మండల కార్యదర్శిగా నరేంద్ర

**కారేపల్లి, నవంబర్10, మహా:** సీపీఎం కారేపల్లి మండల కార్యదర్శిగా కే నరేంద్ర ఏకగ్రీవంగా ఎన్నికైనారు. ఆదివారం కారేపల్లిలో జరిగిన మండల మహాసభలో నూతన కమిటీని ఎన్నుకున్నారు. కార్యదర్శిగా కే నరేంద్రతోపాటు మరో 20 మందితో కమిటీని ఎన్నుకున్నారు. ఎస్ఎఫ్ఐ, డీవైఎఫ్ఐ, సీఐటీయు రంగాలలో పనిచేసిన కే నరేంద్ర సీపీఎం మండల కార్యదర్శిగా వరసగా మూడు సార్లు ఎన్నికైనారు.

# సత్తుపల్లిలో అవగాహన సదస్సు



**సత్తుపల్లి, నవంబర్ 10, మహా:** అదనపు జిల్లా కలెక్టర్ ఆదేశాలతో మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో సత్తుపల్లిలో సి.ఎస్.ఆర్ ఆదిత్య స్కూల్, మైనారిటీ హాస్టల్ ప్రాంగణంలో "చిన్నారులతో ముచ్చట్లు" అనే కార్యక్రమాన్ని బాలల పరిరక్షణ విభాగం ప్రొటెక్షన్ ఆఫీసర్ సోనీ ప్రేమలీల ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా చిన్న పిల్లలపై జరుగుతున్న అత్యాచారాలు, దాడులపై అవగాహన కల్పిస్తూ ప్రముఖంగా ఆడపిల్లల్లో శరీర మార్పులతోపాటు మానసిక ఎదుగుదల పెంపొందించేలా మంచి స్పర్శ చెడు స్పర్శ అంశంపై ఎలా వ్యవహరించాలి..? ఎదుటివారి దుర్బుద్ధిని గ్రహించే విషయంపై తర్ఫీదు ఇచ్చారు. మాదకద్రవ్యాల వాడకం, ఇంటర్ నెట్ లో అశ్లీల దృశ్యాలకు పిల్లలు ఆకర్షితులు కాకుండా తల్లిదండ్రులు జాగ్రత్త వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మాధవి(విద్యా విభాగం), అనిత (ఆరోగ్య శాఖ విభాగం)తోపాటు స్కూల్ సిబ్బంది పాల్గొన్నారు.

# పెనుబల్లిలో సర్వాయి పాపన్న విగ్రహావిష్కరణ



**సత్తుపల్లి, నవంబర్ 10, మహా:** పెనుబల్లి గ్రామంలో గౌడ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం సర్వాయి పాపన్న గౌడ్ మహారాజ్ విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి దయానంద్, రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు డాక్టర్ మట్టా దయానంద్ విజయ్ కుమార్ చేతుల మీదుగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ సర్వాయి పాపన్నను స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. సత్తుపల్లి నియోజకవర్గంలోని గౌడ కుటుంబాలకు నిత్యం అందుబాటులో ఉంటమన్నారు. గౌడన్నల కుటుంబాల సమస్యల పరిష్కారం కోసం అన్ని విధాలుగా సహకరిస్తామన్నారు. త్వరలో మరికొన్ని కాటమయ్య రక్షణ కిట్లు గౌడ సోదరులకు అందిస్తామని తెలిపారు. అనంతరం పెనుబల్లి మండల గౌడ సంఘం కార్తీక మాస వన మహోత్సవ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర, జిల్లా, పెనుబల్లి మండల గౌడ సంఘం అధ్యక్షులు, గౌడ సంఘం కమిటీ సభ్యులు, విగ్రహ కమిటీ సభ్యులు, విగ్రహ దాతలు మరియు మండల కాంగ్రెస్ నాయకులు, గ్రామ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# దోపిడీ లేని సమాజం ఎర్రజెండాతోనే సాధ్యం

## సీపీఐ(ఎం) రాష్ట్ర నేత పి. సోమయ్య



**కారేపల్లి, నవంబర్ 10, మహా:** దోపిడిలేని సమాజం ఎర్రజెండాతోనే సాధ్యమని సీపీఐ(ఎం) రాష్ట్ర నాయకులు పి. సోమయ్య అన్నారు. సీపీఐ (ఎం) సింగరేణి మండల మహాసభ ఆదివారం దమ్మాలపాటి వెంకటేశ్వర్లు నగర్, భూక్య జగ్యా, రేపాకుల లాలయ్య ప్రాంగణంలో ఉత్సాహభరిత వాతావరణంలో జరిగాయి. తలారి దేవప్రకాశ్, దాసరి మల్లయ్య, సూరబాక ధనమ్మ అధ్యక్షత వహించిన ఈ సభలో సోమయ్య మాట్లాడుతూ పెట్టుబాడిదారి, రాచరిక రాజ్యాంగాలు కల దేశాల ఆర్ధిక వ్యవస్థలు కూప్పకూలి పోతున్నాయని, ప్రత్యామ్నాయంగా సోషలిజం, కమ్యూనిజం వ్యవస్థలు ఏర్పాడుతున్నాయన్నారు. శ్రీలంక, నేఫాల్, లాటిన్ అమెరికా దేశాలలో సోషలిజం ప్రజా సమస్యలను పరిష్కరిస్తుందన్నారు. సోషలిస్టు చైనా ప్రపంచ ఆర్ధిక వ్యవస్థను శాసించే స్థాయికి ఎదిగిందన్నారు. పెట్టుబడిదారి విధానంలో ప్రజా ప్రయోజనాలకన్న పెట్టుబడిదారుల ప్రయోజనాలకు పాలకులు పరితపిస్తారన్నారు. భారతదేశాన్ని ఆ దిశగా ప్రధాని మోడీ నడిపిస్తున్నారన్నారు. మోడీ విదేశి పర్యటనలు కేవలం ఆదానీ, అంబానీల ఆర్ధిక ప్రయోజనాలను కాపాడటానికి చేసుకుంటున్న ఒప్పందాలని విమర్శించారు. బూర్జువా పార్టీలు తమ అధికారం కోసం హామీలతో ప్రజలను మోసం చేస్తున్నారన్నారు. కేంద్రంలోని బీజేపీ అవినీతి రూపుమాఫీ రూ. 75 లక్షల కోట్ల నల్లడబ్బును తెచ్చి ప్రజలకు పంచుతానని చెప్పి వంచించిందన్నారు. దానికోసం ప్రజలను జన్‌ధన్ ఖాతాల పేరుతో ఖాతాలు తెరిపించి ప్రజల చేత బ్యాంకులకు రూ. లక్ష కోట్లు ఆదాయం వచ్చేలా చేసిందన్నారు. ప్రజల డబ్బును ఎస్‌బీఐ ద్వారా ఆదానీకి రూ. 12 లక్షల కోట్లు అప్పులిప్పించారన్నారు. 2 కోట్లు ఉద్యోగాలు ఊసే లేదన్నారు. మతం పేరుతో రెచ్చగట్టి అధికారాన్ని కాపాడుకోవటానికి మోడీ ప్రయత్నిస్తున్నారని, ఇది ఎల్లకాలం సాగదన్నారు. రాష్ట్రంలో నీళ్లు, నిధులు, నియామకాలతో పేరుతో అధికారంలోకి వచ్చిన బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ కుటుంబ పాలన, కాళేశ్వరం అవినీతి, బిడ్డ మద్యం కుంభకోణం, ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చక పోవటంతో ప్రజలలో పలుచనయ్యరన్నారు. రెట్టింతల సంక్షేమమంటూ నోటికి వచ్చిన హామీలిచ్చి అధికారం చేపట్టిన కాంగ్రెస్ ఏడాదికే చతికిల పడిందన్నారు. ప్రజలలో అసంతృప్తి పెరిగిపోతుందని, పాలన వైఫల్యాన్ని కప్పిపుచ్చటానికే హైడ్రా, మూసీ ప్రక్షాళన అంటూ ప్రజలను పక్కదారి పట్టించే ఎత్తుగడలు వేస్తున్నారన్నారు. దేశంలో సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో బలమైన ఉద్యమాలు నిర్మించటానికి అవకాశాలు ఉన్నాయన్నారు. క్షేత్రస్థాయిలో బలమైన ఉద్యమాలను నిర్మించి ప్రజలను భాగస్వామ్యం చేయాలని పార్టీ సభ్యులను కోరారు. అనంతరం మండల కార్యదర్శి నరేంద్ర కార్యదర్శి నివేదికను ప్రవేశపెట్టారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు భూక్యా వీరభద్రం, బొంతు రాంబాబు, మూడ్ శోభన్, జిల్లా కమిటీ సభ్యులు మెరుగు సత్యానారాయణ, కొండబోయిన నాగేశ్వరరావు, దుగ్గి కృష్ణ, తాళ్లపల్లి కృష్ణ, రేపాల శ్రీనివాస్, మెరుగు రమణ, చింతల రమేష్, వజ్జా రామారావు, వడ్డె అజయ్‌బాబు, బానోత్ భారతి, అంబటి శ్రీనివాసరెడ్డి, బాదావత్ శ్రీను, ముక్కా సీతారాములు, సదానందం, లక్ష్మినర్సయ్య, బానోత్ బన్సీలాల్, మోతుక్కూరి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

## ఇండియన్ మాల లాయర్ల అసోసియేషన్ ఆవిర్భావం



**ఖమ్మం సిటీ, నవంబర్ 10, మహా:** తల్లంపాడు గ్రామంలో శనివారం నిర్వహించిన సమావేశంలో "ఇండియన్ మాల లాయర్ల అసోసియేషన్" కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా రెంటాల ఆనంద్, ఉపాధ్యక్షులుగా పి. బాలకృష్ణ(ఇల్లందు బార్ కౌన్సిల్ మాజీ అధ్యక్షులు), ప్రధాన కార్యదర్శిగా మర్రి ప్రకాష్, సహాయ కార్యదర్శిగా పప్పుల రత్నాకర్, కొశాధికారిగా కొనకంచి శ్రీచరణ్ లను ఎన్నుకోగా గౌరవ సలహా దారులుగా పల్లా రాజశేఖర్, పీఏజే శేఖర్ రాజు, క్రిస్టోపర్ మోజెస్ కార్యనిర్వాహక సభ్యులుగా గోరింట్ల శాంతారావు, పిడతల రామ్మూర్తి, గుడిసె అనిల్ లను ఎన్నుకున్నారు. గౌరవ సలహా దారులు, అధ్యక్ష కార్యదర్శులు మాట్లాడుతూ న్యాయవాదుల వృత్తిలో "మాల" న్యాయవాదులందరూ ఐక్యంగా ఉంటూ సమాజానికి తమ వంతుగా సేవ చేయాలన్నారు. దేశాభివృద్ధిలో డా. బీఆర్ అంబేద్కర్ చూపిన బాటలో పయనిస్తూ ఆదర్శంగా ఐక్యంగా ముందుకు వెళ్లాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో లాయర్లతోపాటు తదితరులు పాల్గొన్నారు.

# ఇల్లందులో వినయ్ ఛాలెంజర్ జిమ్ ప్రారంభం





**ఇల్లందు, నవంబర్ 10, మహా:** మున్సిపల్ పరిధిలోని 22వ వార్డులో నూతన హంగులతో ఏర్పాటు చేసిన వినయ్ ఛాలెంజర్ జిమ్ ను ఆదివారం ఎమ్మెల్యే కోరం కనకయ్య ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నేటి కాలంలో వ్యాయామం ఎంతో అవసరమన్నారు. శరీర ధృడత్వంతో అనేక ప్రయోజనాలు ఉంటాయని తెలిపారు. యువకులే కాకుండా ప్రతి ఒక్కరూ జిమ్ కు వచ్చి వ్యాయామం చేయాలన్నారు. గత 2 శతాబ్దాలుగా జిమ్ ను నడిపిస్తూ సినీ ఆర్టిస్టులు, ఆర్మీ, పోలీస్ ఉద్యోగాలలో సత్తా చాటేలా చేసి మరల అత్యాధునిక పరికరాలతో నూతన హంగులతో అంతర్జాతీయ పరిణామాలతో జిమ్ ను ఏర్పాటు చేసి పట్టణ ప్రజలకు అందుబాటులోకి తీసుకురావడం సంతోషకరమన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ దమ్మాలపాటి వెంకటేశ్వరరావు, ఇల్లందు డీఎస్పీ ఎన్. చంద్రభాను, సినీ ఆర్టిస్ట్ అంకెపాక వినయ్, 22వ వార్డు కౌన్సిలర్ అంకెపాక నవీన్ కుమార్, సీఐ బత్తుల సత్యనారాయణ, జిల్లా కాంగ్రెస్ నాయకులు కోరం సురేందర్, సీపీఐ, సీపీయం నేతలు కె. సారయ్య, అలేటి కిరణ్, మున్సిపల్ కౌన్సిలర్లు, కాంగ్రెస్ నాయకులు, 22వ వార్డు ప్రజలు కదారి నటరాజ్, మధుకర్, శ్రీధర్, సతీష్ పాసి, నాజీమ్, మహేష్ తోపాటు తదితరులు పాల్గొన్నారు.

## అనారోగ్యంతో బాలుడు మృతి

**గుండాల, నవంబర్ 10, మహా:** పసితనంలోనే ప్రాణాలతో పోరాడి తిరిగిరాని లోకాలకు వెళ్లిన బాలుని విషాద ఘటన మండలంలో చోటుచేసుకుంది. మండల కేంద్రానికి చెందిన వెలిశాల వేణు, సంధ్య దంపతుల మొదటి కుమారుడైన సాయి చరణ్ (14) ఆదివారం అనారోగ్యంతో మృతిచెందాడు. గత 15 రోజుల క్రితం జ్వరంతో బాధపడుతున్న బాలుడు కొత్తగూడెం, ఖమ్మం ప్రైవేట్ ఆసుపత్రులలో చికిత్స పొందాడు. కామెర్ల కారణంగా ఆరోగ్య పరిస్థితి విషమించడంతో ఖమ్మంలో ఓ ప్రైవేట్ వైద్యశాల, అక్కడి నుంచి వైద్యుల సలహా మేరకు హైదరాబాద్ నిమ్స్ ఆసుపత్రికి తరలించారు. మూడు రోజులపాటు చికిత్స పొందుతూ ఆదివారం సాయంత్రం మృతి చెందాడు. మండల ప్రజలు సాయి చరణ్ బతికి రావాలని అనేక రకాలుగా సహాయ సహకారాలు అందించినప్పటికీ మృత్యువుతో పోరాడి ప్రాణాలు వదిలాడు. సాయి చరణ్ మరణించడంతో గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.

## తమ్మినేని వీరభద్రంకు సొంతూరులో షాక్!

### 60 ఏళ్ల తర్వాత ఏకగ్రీవంగా కాంగ్రెస్ కమిటీ ఎన్నిక

**ఖమ్మం రూరల్, నవంబర్ 10, మహా:** ఒక్కటి కాదు.. రెండు కాదు.. ఏకంగా 60 సంవత్సరాలుగా గ్రామంలో ఏకచిత్రాధిపత్యం వహిస్తున్న సీపీఎం పార్టీకి కాంగ్రెస్ పార్టీ చెక్ పెట్టింది. సీపీఎం పార్టీ రాష్ట్ర కార్యదర్శిగా కొనసాగుతున్న తమ్మినేని వీరభద్రం గ్రామం తెల్దారుపల్లిలో ఎవరు ఊహించిన విధంగా కాంగ్రెస్ పార్టీ గ్రామ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకుంది. 2019 వరకు కూడా ఈ గ్రామంలో సీపీఎం పెత్తనం నడిచింది. దీంతో ఈ గ్రామంలో ఇతర పార్టీల ఊసే లేకుండా పోయింది. అయితే, తమ్మినేని కృష్ణయ్య సీపీఎంకు వ్యతిరేకంగా బయటకు వచ్చి ఎంపీటీసీ బరిలో నిలబడి కృష్ణయ్య భార్యను గెలిపించుకుని విజయకేతనం ఎగురవేశారు. 2023 అసెంబ్లీ ఎన్నికల్లో తమ్మినేని కృష్ణయ్య తనయుడు మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీ తీర్థం పుచ్చుకున్న విషయం తెలిసిందే. అయితే, సుమారుగా 5 ఐదు దశాబ్దాల తరువాత గ్రామంలో కాంగ్రెస్ పార్టీ కమిటీని తాజాగా ఎన్నుకున్నారు. దీంతో ఈ అంశం చర్చనీయంగా మారింది. కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షుడిగా గజ్జి వీరబాబు, ఉపాధ్యక్షులు బోడపట్ల రమేష్, కార్యదర్శి చావ సతీష్, సహాయ కార్యదర్శిగా చాట్ల రవిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నామని గ్రామానికి చెందిన జిల్లా కాంగ్రెస్ నాయకుడు తమ్మినేని నవీన్ తెలిపారు. గ్రామంలో అన్ని వర్గాల ప్రజలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందిస్తామని ఆయన తెలిపారు. ప్రజల సంక్షేమమే లక్ష్యంగా పని చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక కాంగ్రెస్ నాయకులు, నెల్లూరు వినోద్, గ్రామ సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

# అడుగడుగునా సర్వే అధికారులకు ఆటంకాలు

### ఆదాయ, వ్యయాలు వెల్లడించేందుకు సుముఖత

### ఖమ్మంలో ప్రారంభం కాని సర్వే

### నగరంలో 90 శాతం ఇండ్లకు గుర్తింపు ప్రక్రియ పూర్తి



**ఖమ్మం జిల్లా ప్రతినిధి, నవంబర్ 10, మహా:** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన కులగణ సర్వేకు ప్రజలు పూర్తిస్థాయిలో సహకరించడం లేదు. వాస్తవాలను దాటవేసి సమాధానాలు చెబుతున్నారు. నిజాలు చెబితే అందుతున్న ప్రభుత్వ పథకాలు ఎక్కడ చేజారిపోతాయనే భావనతో ప్రజలు సర్వే అధికారులకు సహకరించడంలేదు. 75 రకాల ప్రశ్నలకు ప్రజల నుంచి సమాధానాలు రాబట్టేందుకు అవసరమైన శిక్షణను అధికారులకు ఇచ్చినప్పటికీ క్షేత్రస్థాయిలో మాత్రం పనిచేయడం లేదు. దీంతో క్షేత్రస్థాయిలో మాత్రం ప్రజల నుంచి సమాధానాలు రాబట్టేందుకు నానా ఇబ్బందులు పడుతున్నారు. ప్రధానంగా బ్యాంకులో అప్పులు, ఖర్చు వివరాలు, భూములు, ఆదాయాలు వెల్లడించే విషయంలో తర్జనభర్జన పడుతున్నారు. అంతేకాకుండా వాహనాలు, ఇన్కమ్ టాక్స్ వంటి వివరాలు తెలియజేస్తే ప్రభుత్వ పథకాలు అందవనే ఉద్దేశంతో వాటిని గోప్యంగానే ఉంచుతున్నారు. గత రెండు రోజులుగా కులగణ సర్వే కొనసాగుతున్నప్పటికీ ఫలితాలు మాత్రం ఆశించిన స్థాయిలో రావడం లేదు. జిల్లా వ్యాప్తంగా 571240 కుటుంబాలలో సర్వే నిర్వహించేందుకు 5 వేల మంది సిబ్బంది క్షేత్రస్థాయిలోకి వెళ్లారు. ఆదివారం నాటికి జిల్లా వ్యాప్తంగా 30616 కుటుంబాల్లో సర్వే పూర్తి చేశారు. అత్యధికంగా కొణిజర్ల మండలంలో 2661 కుటుంబాల్లో సర్వే పూర్తికాక, తక్కువగా మధిర మండలంలో కేవలం 714 కుటుంబాలు మాత్రమే సర్వే నిర్వహించారు. మొత్తం మీద జిల్లాలో 5.36 శాతం సర్వే పూర్తయింది. ఆదివారం కావడంతో సర్వే అధికారులు మధ్యాహ్నంకు ఇంటి బాట పట్టారు. సర్వే ప్రారంభించి రెండు రోజులు అయినప్పటికీ ఖమ్మం నగరంలో మాత్రం అధికారులు ఇండ్ల గుర్తింపు ప్రక్రియలోనే ఉన్నారు. ఖమ్మం నగరంలో 1,68,875 కుటుంబాలు ఉండగా 1,53, 085 గృహాలకు స్టిక్కర్లు అంటించారు. దీంతో ఇప్పటివరకు నగరంలో 90 శాతం గృహాల గుర్తింపు ప్రక్రియ పూర్తయింది. అదలా ఉండగా జిల్లా వ్యాప్తంగా ఉన్నతాధికారులు, ప్రజా ప్రతినిధులు సర్వే తీరును పర్యవేక్షిస్తున్నారు. గ్రామీణ ప్రాంతాలతో పోల్చితే నగరాలు, పట్టణ ప్రాంతాల్లో సర్వే తీరు మరింత దారుణంగా ఉన్నదని క్షేత్రస్థాయి అధికారులు వాపోతున్నారు. పలువురు సంపన్న శ్రేణి, ఎగువ మధ్య తరగతి గృహ యజమానులైతే ఇండ్లకు స్టిక్కరింగ్ చేసేందుకు కూడా సహకరించడం లేదని, వద్దని తిప్పి పంపుతున్నారని తమ అనుభవాలు చెప్తున్నారు. అనేక రకాలుగా ప్రయత్నించి ఒకవేళ నివాస సముదాయాల్లోకి వెళ్లినా అక్కడ కూడా ప్రశ్నలు, నిలదీతలే ఎదురవుతున్నాయని, వారికి ఏం సమాధానం చెప్పాలో తెలియక గందరగోళ పరిస్థితి నెలకొన్నదని ఎన్యూమరేటర్లు తలలు పట్టుకుంటున్నారు. ఖమ్మం నగరాల్లోని అపార్ట్‌మెంట్లలో నివసించే కుటుంబాల సేకరణ మరింత సవాల్‌గా మారిందని ఎన్యూమరేటర్లు వివరిస్తున్నారు. ఇండ్లకు వెళ్లే సమయానికి అపార్ట్‌మెంట్లలో ఎవరూ ఉండటం లేదని, ఉన్నా కూడా సమాచారం ఇవ్వకుండా ఎలా వస్తారని ప్రశ్నిస్తున్నారని, ఎప్పుడు వస్తారో తెలియకుండా ఇంట్లోనే ఎలా ఉంటామంటూ గ్రామీణ ప్రాంతాల్లో వివరాలను ఇచ్చేందుకు ప్రజానీకం పూర్తి విముఖతను చూపుతుండటం సర్వత్రా చర్చనీయాంశంగా మారింది. సర్వే ఫారాలలో ప్రధాన ప్రశ్నలు 57, ఉపప్రశ్నలు 18 కలిపి మొత్తంగా 75 ప్రశ్నలతో కూడిన ఫారాలను పూర్తిగా నింపాల్సి ఉన్నది. ఒక్కో ఎన్యూమరేటర్ రోజుకు 10 ఇండ్ల చొప్పున వివరాలను నమోదు చేయాల్సి ఉంది. ఒక్కో సర్వే కాపీ నింపడానికి గంటకు పైనే సమయం పడుతుందని ఎన్యూమరేటర్లు వివరిస్తున్నారు. సమాచార సేకరణకు ప్రజలను అనేక విధాలుగా ఒప్పించాల్సి వస్తున్నదని, అప్పటికీ అరకొరగానే వివరాలు వస్తున్నాయని తెలుపుతున్నారు. రుణం ఎంత తీసుకున్నారు? ఎక్కడి నుంచి తీసుకున్నారు? ఇంటి విస్తీర్ణం ఎంత? ఎన్ని గదులు ఉన్నాయి? మీ ఇంట్లో ఎన్ని ఆవులు, గేదెలు, మేకలు, కోళ్లు, పందులు ఉన్నాయి తదితర అనవసర ప్రశ్నలు అనేకం ఉన్నాయని ఇటు ప్రజలు, అటు ఎన్యూమరేటర్లు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఈ ప్రశ్నలకు ప్రజలు పూర్తిస్థాయిలో నిజాలను వెల్లడించలేక పోతున్నారు. సంపదకు సంబంధించిన, ఆదాయ మార్గాలకు సంబంధించిన వివరాలు వెల్లడిస్తే ప్రభుత్వ పథకాలు కోల్పోయిన వారమవుతామని ప్రజలు అపోహ పడుతున్నారు. మొత్తం మీద రెండో రోజు కూడా సర్వే అధికారులకు ప్రజలు పూర్తిస్థాయిలో సహకరించడం లేదని స్పష్టం అవుతుంది.

## మా ఆకలి బాధలు తీర్చండి మహాప్రభో

### ఎమ్మెల్యే పాయంకు హాస్టల్ వర్కర్ల వినతి



**మణుగూరు, నవంబర్ 10, మహా:** తమ బాధలు తీర్చాలంటూ గిరిజన సంక్షేమ శాఖ పోస్ట్ మెట్రిక్ పీఎంహెచ్ హాస్టల్ వర్కర్లు పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు ముందు తమ గోడు వెళ్లబోసుకున్నారు. 22 నెలలుగా తమకు జీతాలు చెల్లించడంలేదని, బకాయి వేతనాలను వెంటనే చెల్లించేలా చూడాలని కోరుతూ సీఐటీయూ ఆధ్వర్యంలో ఎమ్మెల్యేకు వినతి పత్రం అందజేశారు. సంక్రాంతి, దసరా పండుగలు ముందు వరుసగా ధర్నాలు, పోరాటాలు నిర్వహించిన ఫలితంగా ఐటీడీఏ పీవో రెండు విడుదలగా ఆరు నెలలు వేతనాలు చెల్లించారని, కానీ, ఇంకా 16 నెలల వేతనాలు బకాయి ఉన్నాయని ఎమ్మెల్యేకు విన్నవించారు. తామంతా గిరిజనులమని, గిరిజన విద్యార్థుల చదువు కోసం తమ కుటుంబాలను పస్తులు ఉంచి వంట చేస్తున్నామన్నారు. అయినా తమ బాధలు ప్రభుత్వానికి పట్టడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే స్పందిస్తూ జీతాలు అందేలా చూస్తానని హామీ ఇచ్చారు.

## టీటీడీ బోర్డు మెంబర్ నర్సిరెడ్డికి సన్మానం

**బోనకల్, నవంబర్ 10, మహా:** తిరుమల తిరుపతి బోర్డు మెంబర్ గా నియమితులైన తెలంగాణ తెలుగుదేశం పార్టీ నాయకులు నన్నూరి నర్సిరెడ్డికి ఖమ్మం జిల్లా టీడీపీ కన్వీనర్ వాసిరెడ్డి రామనాథం, రాష్ట్ర ఎస్సీ సెల్ ఉపాధ్యక్షులు, మధిర నియోజకవర్గ టీడీపీ అడహాక్ కమిటీ సభ్యులు దోమందుల సామేల్, టీడీపీ అడహాక్ కమిటీ సభ్యులు రావుట్ల సత్యనారాయణ ఆదివారం పుష్పగుచ్ఛం అందజేసి ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ టీడీపీ నాయకులు గూడూరు వెంకటేశ్వరరెడ్డి, బాగం రమేష్, ఎల్ బీ నగర్ నియోజకవర్గ



అడహాక్ కమిటీ మెంబర్ తాటికొండ స్వాతి చౌదరి, దేవరకొండ మోహనరావు, వరుకొంటి రవి, బి. రాయప్ప తదితరులు పాల్గొన్నారు.

## ఆర్యవైశ్యులకు అండగా ఉంటాం

### భట్టి విక్రమార్క సతీమణి మల్లు నందిని

**మధిర, నవంబర్ 10, మహా:** కార్తీకమాసం సందర్భంగా ఆదివారం ఆర్యవైశ్య వనసమారాధన సందడిగా జరిగింది. మధిర మండలం అత్కూర్ గ్రామంలోని మామిడి తోటలో ఆర్యవైశ్య వనసమారాధన అంగరంగా వైభవంగా పట్టణ ఆర్యవైశ్య సంఘం, మండల ఆర్యవైశ్య సంఘం కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో ఉదయం ఉసిరి చెట్టు వద్ద సత్యనారాయణ స్వామి వ్రతం నోములు కార్యక్రమం, మహిళలు పండు తాంబూలం నోముల కార్యక్రమం అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి తెలంగాణ ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క సతీమణి అమ్మ ఫౌండేషన్ చైర్మన్ మల్లు నందిని హాజరై మాట్లాడారు. ప్రజలకు ఏ సమస్య వచ్చినా తమకు తెలియజేయాలని, వాటిని పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు. వనసమారాధన కార్యక్రమంలో భాగంగా ఏర్పాటు చేసిన భోజన కార్యక్రమంలో పాల్గొని వివిధ రకాల వంటలు రుచికరంగా ఉన్నాయని అన్నారు. కార్తీక మాసంలో నిర్వహించే వనసమారాధన కార్యక్రమం ఆహ్లాదకరంగా ఆనందంగా ఉంటుందని చిన్ననాటి స్నేహితులు, బంధువులు దూర ప్రాంతాల నుంచి వచ్చి కార్యక్రమంలో పాల్గొనడం ఎంతో గొప్ప విషయమన్నారు.



అన్నదాన కార్యక్రమానికి సేవలందించిన సత్యసాయి బాబా సేవాదళ్ సభ్యులకు కమిటీ సభ్యులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పట్టణ ఆర్యవైశ్య సంఘం మండల ఆర్యవైశ్య సంఘం నాయకులు వనమా వేణుగోపాలరావు, వనమా కిరణ్ కుమార్, వంగవేటి రాజశేఖర్, చారు గుండ్ల నరసింహమూర్తి, కాజా చక్రం, పల్లపోతు ప్రసాదరావు, మహంకాళి వెంకట శ్రీనివాసరావు, వేముల నవీన్ కుమార్, ఇరుకుల్ల సురేష్, చల్లా సత్యనారాయణ, పల్లపోతు సింధు, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి వేమిరెడ్డి శ్రీనివాస రెడ్డి, 15 వార్డు కౌన్సిలర్ కోన ధన కుమార్, ఇది అనిల్ కుమార్ నెహ్రూ, రంగా శ్రీనివాసరావు, మిరియాల వెంకటరమణ గుప్తా, కరివేద సుధాకర్, సిద్ధంశెట్టి సందీప్ తదితర పిల్లలు పెద్దలు మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## సెక్యూరిటీ గార్డులకు కూడా భీమా పథకం వర్తింపజేయాలి: ఐఎఫ్టీయూ




**మణుగూరు, నవంబరు 10, మహా:** సింగరేణి ప్రైవేట్ సెక్యూరిటీ గార్డులకు కాంట్రాక్ట్ వర్కర్లకు, ఓబీ వర్కర్లకు ఇటీవల సింగరేణి యాజమాన్యం ప్రైవేట్ బ్యాంకులతో ఒప్పందం చేసుకుని అమల్లోకి తెచ్చిన ప్రమాద భీమా పథకాన్ని బయట ప్రమాదాలకు, సహజ మరణాలకు, అంగ వైకల్యానికి కూడా విస్తరింపచేయాలని ఐఎఫ్టీయూ ఏరియా నాయకులు అంగోత్ మంగీలాల్ సింగరేణి యాజమాన్యాన్ని విజ్ఞప్తి చేశారు. ఆదివారం సాయంత్రం స్థానిక జీఎం కార్యాలయ ప్రైవేట్ సెక్యూరిటీ అడ్డా వద్ద జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రస్తుతం ప్రైవేట్ బ్యాంక్ ల వారితో మాట్లాడి సింగరేణి పొరుగు సేవల వర్కర్లకు అమలులోకి తెచ్చిన రూ. 30 లక్షల ప్రమాద భీమా పథకాన్ని బయట ప్రమాదాలతో పాటు సహజ మరణాలకు కూడా వర్తింపచేయాలని కోరారు. విధి నిర్వహణలో కాకుండా బయట ప్రమాదాలకు సహజ మరణాలకు ఎలాంటి బీమా పథకాలు అమలులో లేకపోవడంతో ఇటీవల గుండెపోటుతో మృతి చెందిన సింగరేణి ప్రైవేట్ సెక్యూరిటీ గార్డ్ పొడుపుగంటి రమేష్ కుటుంబం అనాథగా మిగిలిపోయారన్న విషయాన్ని ఈ సందర్భంగా ఆయన గుర్తు చేశారు. ఇంటి యజమాని ఉన్నంతవరకు కష్టమో సుఖమో కుటుంబాన్ని పోషిస్తారని, దురదృష్టవశాత్తు అతనికి ఏదైనా జరిగితే వారి మీదే ఆధారపడి జీవిస్తున్న కుటుంబం అనాథలుగా మిగిలిపోతారన్నారు. రమేష్ కుటుంబాన్ని సింగరేణి యాజమాన్యం, ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రైవేట్ సెక్యూరిటీ సూపర్వైజర్ రామ్ అవతార్ ప్రైవేట్ సెక్యూరిటీ గార్డులు యగ్గడి ప్రభాకర్, పి వీరబాబు, డి వంశీ, యు రమేష్, కే శేఖర్ బాబు, ఎన్ సుధాకర్ ,వంశీ, పి రవి, డి వీరబాబు, యు రమేష్, కే శేఖర్ బాబు తదితరులు పాల్గొన్నారు

## సర్వే పై సందేహాలు వద్దు

### ఖమ్మం ఆర్డీవో నరసింహారావు

**బోనకల్, నవంబర్ 10, మహా:** ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్న సమగ్ర కుటుంబ కులగణన సర్వేపై సందేహాలు, అపోహలు అవసరం లేదని, ప్రజలు సర్వే ప్రక్రియలో భాగస్వాములై తమ వివరాలను నమోదు చేసుకోవాలని ఖమ్మం ఆర్డీవో, సమగ్ర సర్వే నియోజవర్గ ప్రత్యేక అధికారి జీ నరసింహారావు సూచించారు. ఆదివారం మండల పరిధిలోని ముష్టికుంట్ల గ్రామంలో నిర్వహిస్తున్న ఇంటింటి సర్వే ప్రక్రియను ఆయన పరిశీలించారు. ఎన్యూమరేటర్లు ఇంటింటికి వెళ్లి సమాచారం సేకరిస్తున్న తీరును, నిర్ణీత ఫారాలలో ఆయా కోడ్ ల వారీగా వివరాలు నమోదు చేస్తున్న విధానాన్ని గమనించారు. ఎలాంటి తప్పిదాలకు తావులేకుండా ప్రభుత్వ మార్గదర్శకాలను అనుసరిస్తూ ఇంటింటి కుటుంబ సర్వేలో సమగ్ర సమాచారాన్ని సేకరించాలని ఆర్డీవో



అధికారులను ఆదేశించారు. అదేవిధంగా మండల పరిధిలో తుటికుంట్ల మోటమర్రి గ్రామాల్లో జరుగుతున్న సమగ్ర కుటుంబ సర్వేను తహశీల్దార్ అనిశెట్టి పొన్నం చందర్, ఎంపీడీవో ఆర్ రమాదేవి, ఎంఈఓ దామాల పుల్లయ్య, ఎంపీఓ వెంకట సుబ్రహ్మణ్య శాస్త్రీ, ఆర్ ఐ గూగులోతు లక్ష్మణ్ లు సర్వే జరుగుతున్న బ్లాక్ లలో ప్రత్యక్షంగా పాల్గొని ఎన్యూమరేటర్లు నమోదు చేస్తున్న వివరాలను తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల ఎన్యుమరేటర్లు, పంచాయతీ సిబ్బంది ఉన్నారు.

## జాతీయస్థాయి పోటీలకు శ్రీనిధి విద్యార్థిని

### అండర్ - 17 కోకో జట్టుకు ఎంపిక

**మధిర, నవంబర్ 10, మహా:** జాతీయస్థాయి పోటీలకు తమ స్కూల్ విద్యార్థి ఎంపికైనట్లు శ్రీనిధి కాన్సెప్ట్ స్కూల్ కరస్పాండెంట్ బి అంజన బాబు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ వారు గత మూడు రోజులుగా (8, 9, 10 తేదీల్లో) కల్లూరులో అండర్ 17 బాలికల రాష్ట్ర స్థాయి కోకో పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో తెలంగాణా రాష్ట్రంలోని అన్ని జిల్లాల బాలికల జట్లు పాల్గొన్నాయి. ఖమ్మం జిల్లా జట్టు తరుపున శ్రీనిధి కాన్సెప్ట్ స్కూల్ నందు 10 వ తరగతి చదువుతున్న సి.హెచ్. దుర్గా భవానీ టీమ్ కెప్టెన్ గా జిల్లా జట్టు గెలుపులో కీలక పాత్ర పోషించింది. వారి ప్రతిభను గుర్తించిన రాష్ట్ర పరిశీలకులు జాతీయ స్థాయిలో జరిగే పోటీలకు తెలంగాణా జట్టులోకి ఎంపిక చేశారని ఆయన తన సంతోషాన్ని వ్యక్తం చేశారు. విద్యార్థులకు చదువుతోపాటు క్రీడల పట్ల ఆసక్తి ఉండాలన్నారు. ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు వారిని అన్ని రంగాల్లో ప్రోత్సహించాలన్నారు. ఎంపికైన విద్యార్థినీని స్కూల్ డైరెక్టర్ సి. హెచ్. చందు, పీఈటీ శివ, ఉపాధ్యాయులు అభినందించారు.

ANN తెలుగు
మహా పత్రిక
సోమవారం, హైదరాబాద్ | 11-11-2024 | వ్యాపార వార్తలు | BUSINESS NEWS | WWW.MAHAADAILY.COM


# బోనస్‌లో కోత.. సీనియర్లకు టీసీఎస్ షాక్

**మహా, బిజినెస్:** దేశీయ ఐటీ దిగ్గజం టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్(టీసీఎస్) సీనియర్ ఉద్యోగులకు షాకిచ్చింది. ఖర్చులను నియంత్రించుకోవడంలోభాగంగా సీనియర్ ఉద్యోగులకు అందించనున్న బోనస్‌లో 20 శాతం నుంచి 40 శాతం వరకు కోత విధించింది. అంతక్రితం త్రైమాసికంలో వేరియబుల్ 70 శాతం వరకు పెంచిన సంస్థ..ఆ మరుసటి త్రైమాసికంలో దీంట్లోనూ కోత పెట్టింది. జూలైసెప్టెంబర్ మధ్యకాలానికిగాను జూనియర్ స్థాయి ఉద్యోగులు వేరియబుల్ అలవెన్స్‌లు అందుకోగా, పలువురు సీనియర్ ఉద్యోగులకు మాత్రం దీంట్లో 40 శాతం వరకు కోత పెట్టినట్లు తెలిసింది. పలు యూనిట్‌లో పనిచేస్తున్న ఉద్యోగుల పనితీరు ఆధారంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు కంపెనీ ఉన్నతాధికారి ఒకరు వెల్లడించారు.

ఆఫీస్ అటెండెన్స్, పనితీరు ఆధారంగా ఉద్యోగికి బోనస్ అందించడం జరుగుతున్నదని, కానీ కొన్ని బిజినెస్ యూనిట్లలో ఉద్యోగుల పనితీరు మెరుగుపడటం లేదని, దీంతో వారికి చెల్లిస్తున్న అదనపు అలవెన్స్‌లను తగ్గించినట్లు తెలిపారు. జూలై మొదటినాటికి 70 శాతం మంది ఉద్యోగులు తిరిగి కార్యాలయాలకు వస్తున్నారని, ప్రతి వారం వీరి సంఖ్య పెరుగుతున్నది. కంపెనీ చట్టప్రకారం కార్యాలయాలకు వచ్చిన వారికి మాత్రమే పలు వేరియబుల్ చెల్లింపులు జరుపుతున్నది.

# ఎంత సంపాదించినా డబ్బు మిగలడం లేదా..

## అయితే ఈ మనీ సేవింగ్ టిప్స్ మీ కోసమే..!

**మనిషి సంతోషంగా జీవించాలంటే బతకడానికి కావాల్సిన కనీస అవసరాలైనా తీర్చుకోగలగాలి. ఈ అవసరాలన్నీ డబ్బుతో ముడిపడి ఉంటాయని నిపుణులు చెబుతున్నారు. అందుకే ప్రతి ఒక్కరు అవకాశాలు, వనరులను బట్టి తమతమ స్థాయిలో డబ్బు సంపాదించే ప్రయత్నం చేస్తుంటారు. అయితే సంపాదించిన డబ్బును ఎలా పొదుపు చేయాలనేది కొంతమందికి తెలియదు. అందుకే అతిగా ఖర్చు చేస్తారు. అలా చేయడంవల్ల చేతిలో డబ్బు నిలువదు. అత్యవసర పరిస్థితులు ఎదరైనప్పుడు కూడా చేతిలో చిల్లిగవ్వ లేక అవస్థలు పడాల్సి వస్తుంది. అలాంటి అవస్థలు తప్పాలంటే సంపాదించిన దానిలో నెలకు కనీసం 1% నుంచి 5% అయినా సేవ్ చేయాలని నిపుణులు చెబుతున్నారు. మరి మనీని ఎలా సేవ్ చేయాలో ఇప్పుడు తెలుసుకుందాం..**

**మహా, బిజినెస్:** ఈ రోజుల్లో డెబిట్, క్రెడిట్, ఫోన్ పే, గూగుల్ పే లాంటి ఆన్‌లైన్ చెల్లింపులు పెరుగుతున్నాయి. చాలామంది నగదుకు బదులుగా వాటినే ఉపయోగించేందుకు ఇష్టపడుతున్నారు. అయితే కార్డులను ఉపయోగించడంవల్ల మీరు సాధారణం కంటే ఎక్కవ డబ్బును ఖర్చు చేస్తారని నిపుణులు అంటున్నారు. ఎందుకంటే మీ కార్డులో నుంచి ఎంత డబ్బు బయటకు వెళ్తుందో పట్టించుకోరని, అతిగా ఖర్చు చేసి తిరిగి చెల్లించాల్సి వచ్చినప్పుడు బాధపడాల్సి వస్తుందని చెబుతున్నారు. కాబట్టి కార్డులకు బదులుగా నగదును ఖర్చులకు వాడితే భయంతో తక్కువ ఖర్చు చేస్తారని అంటున్నారు. దాంతో డబ్బు సేవ్ అవుతుందని చెబుతున్నారు.

**ఖర్చులు తగ్గించడం**

చాలామంది ఉపయోగం లేని వస్తువులు కొనడమో.. లేక అవసరం లేని వాటికి అనవసరంగా డబ్బు ఖర్చు చెయ్యడమో చేస్తుంటారు. ఇలా అదనపు వస్తువులకు చేసే ఖర్చు తగ్గించుకోవడానికి ప్రయత్నించాలి. వీలైతే వారం రోజుల్లో ఒక రోజు జీరో ఖర్చు రోజుగా పెట్టుకోండి. ఆ రోజు మాత్రం ఎలాంటి ఖర్చు చెయ్యకుండా డబ్బును సేవ్ చెయ్యండి. ప్రతి వారం మీ ఖర్చును తగ్గించుకోవడానికి ఇది ఒక మంచి మార్గంగా పని చేస్తుందని అంటున్నారు నిపుణులు.

**రిచార్జ్ ప్లాన్స్**

ఈ రోజుల్లో చాలామంది బడ్జెట్‌కు మించిన ప్లాన్‌ని ఎంచుకుంటారు. మీరు మీ ఫోన్‌ను ఎలా ఉపయోగిస్తున్నారో బాగా పరిశీలించండి. మీ అవసరాలకు అనుగుణంగా ఉత్తమమైన ప్లాన్‌లను ఉపయోగించుకోండి. ఎందుకంటే ఎక్కువ డేటాను ఉపయోగించనప్పటికీ రిచార్జ్ ప్లాన్ మాత్రం భారీగా చేసుకుంటారు. అలాగే ఇంట్లో ఉండే టీవీ రిచార్జ్ ప్లానింగ్‌లోనూ అలాంటి తప్పులే చేస్తే సరిదిద్దుకోండి. టీవీ ప్లాన్‌లో మీకు ఉన్న అన్ని ఛానెల్‌లు నిజంగా అవసరమా అది కూడా ఆలోచించండి. అలా మీరు చూసే చానెల్స్‌కు మాత్రమే రిచార్జ్ చేయించుకుంటే ఖర్చు కొంతైనా తగ్గుతుంది.

**పార్టీలు, విహార యాత్రలు**

కొందరు ఏ అవకాశం వచ్చినా పార్టీలు, విహార యాత్రలంటూ డబ్బులు ఖర్చు పెట్టేస్తుంటారు. అలా కాకుండా ఇంట్లోనే సరదాగా ఫ్రెండ్స్‌తో ఎంజాయ్ చెయ్యండి. దాంతో డబ్బు కూడా చాలా సేవ్ అవుతుంది. ఇక ఈ రోజుల్లో అందరూ సొంత వాహనాలపైనే ఎక్కువగా ట్రావెలింగ్ చేస్తున్నారు. అయితే ఎక్కువ దూరం వెళ్లాల్సి వచ్చినప్పుడు మీరు కారు లేదా బైక్‌ను ఉపయోగించడం కంటే ప్రజా రవాణాను ఉపయోగిస్తే ఎంతో కొంత ఆదా అవుతుంది.



# నిధుల సేకరణలో స్టార్టప్‌ల దూకుడు

**మహా, బిజినెస్:** నిధులు ఆకర్షించడంలో దేశీయ స్టార్టప్‌లు దూసుకుపోతున్నాయి. ప్రస్తుతవారంలో 138 మిలియన్ డాలర్ల నిధులను సమీకరించాయి. వీటిలో మూడు అతిపెద్ద స్టార్టప్‌లు కాగా, మరో 20 ప్రారంభ దశలో ఉన్న స్టార్టప్‌లు. కనీసంగా 25 స్టార్టప్‌లు 138.7 మిలియన్ డాలర్ల పెట్టుబడులను ఆకట్టుకున్నాయని సర్వే వెల్లడించింది. వీటిలో ఫిన్‌టెక్, డీప్‌టెక్ స్టార్టప్‌లు అత్యధికంగా నిధులను ఆకర్షించగా, వీటిలో 50 మిలియన్ డాలర్ల విలువైన రెండు ఒప్పందాలు ఉన్నాయి. దీంట్లో ఫిన్‌టెక్ స్టార్టప్ ఈజీ హోమ్ ఫైనాన్స్ 35 మిలియన్ డాలర్ల నిధులను ఒకేసారి సేకరించింది. అలాగే మోదీఫై 15 మిలియన్ డాలర్లు, సైన్‌ఎల్‌ఆర్ 10 మిలియన్ డాలర్లు, గెలాక్సీఐ 10 మిలియన్ డాలర్లు సేకరించాయి. దీంతో ప్రస్తుతేడాది దేశీయ స్టార్టప్‌లు 12.2 బిలియన్ డాలర్ల నిధులను సమీకరించాయి. 2023లో మొత్తంగా సేకరించిన 11 బిలియన్ డాలర్ల కంటే ఇది అధికం.



# మళ్లీ మార్కెట్లోకి హీరో కరిజ్మా.. ధర ఎంతంటే?

**మహా, న్యూఢిల్లీ :** హీరో మోటోకార్ప్.. స్పోర్ట్ బైకుల పరిమితిని మరింత విస్తరించడానికి మరో మాడల్‌ను అందుబాటులోకి తీసుకొచ్చింది. కరిజ్మా 210ను అప్‌గ్రేడ్ చేసి మళ్లీ మార్కెట్లోకి ప్రవేశపెట్టింది. 210 సీసీ ఇంజిన్ సామర్థ్యంతో తయారు చేసిన ఈ బైకు యువతను ఉద్దేశంలో పెట్టుకొని తీర్చిదిద్దింది. వచ్చే ఏడాది అందుబాటులోకి రానున్న ఈ స్పోర్ట్స్ బైకు ధర రూ.2 లక్షల స్థాయిలో ఉంటుందని అంచనా. ఆరు స్పీడ్ గేర్‌బాక్స్ కలిగిన ఈ బైకు పలు మార్పులు చేసింది.

# దివీస్ ల్యాబ్స్ లాభం 510 కోట్లు

**మహా, న్యూఢిల్లీ :** దివీస్ ల్యాబ్స్ అంచనాలకుమించి రాణించింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం రెండో త్రైమాసికానికిగాను సంస్థ రూ.510 కోట్ల నికర లాభాన్ని గడించింది. క్రితం ఏడాది ఇదే త్రైమాసికంలో నమోదైన రూ.348 కోట్ల లాభంతో పోలిస్తే 46.5 శాతం వృద్ధిని కనబరిచింది. సమీక్షకాలంలో కంపెనీ ఆదాయం ఏడాది ప్రాతిపదికన 22 శాతం ఎగబాకి రూ.2,338 కోట్లకు చేరుకున్నది.



# దేశం-విదేశం NATIONAL NEWS






# పునరాగమనం!

'ఊయల ఊగి.. ఊగి.. ఉన్నచోటుకే వస్తుందంటారు'.. ఎయిర్‌షిప్ వాడకంలోనూ ఇప్పుడు ఇదే పరిస్థితి పునరావృతమవుతున్నట్టు కనిపిస్తున్నది. ఏడెనిమిది దశాబ్దాల కిందటివరకూ వినియోగించిన ఎయిర్‌షిప్‌లను విమానాల స్థానంలో మళ్లీ తీసుకురావడానికి పెద్దయెత్తున కసరత్తు ప్రారంభమయ్యింది.

**ఏమిటీ ఎయిర్‌షిప్?**

తిమింగళం ఆకారంలో హైడ్రోజన్ వాయువుతో నిండిన బెలూన్ ద్వారా సుదూర ప్రాంతాలకు మనుషులను, సరుకులను రవాణా చేయడానికి వినియోగించే విహంగ నిర్మాణమే ఎయిర్‌షిప్. గాలి కంటే తక్కువ బరువు ఉండే హైడ్రోజన్ వాయువును ఎయిర్‌షిప్ బెలూన్‌లో తొలుత వాడేవారు. అయితే, హైడ్రోజన్‌కు మండే స్వభావం ఎక్కువగా ఉండటంతో ఆ తర్వాత హీలియంను వినియోగించారు.

**మళ్లీ తెర మీదకు ఇలా..**

వాతావరణంలోకి విడుదలవుతున్న కర్బన ఉద్గారాల కారణంగా భూతాపం పెరిగిపోతున్నది. 2.5 శాతం కర్బన ఉద్గారాలు విమానాల కారణంగానే విడుదల అవుతున్నట్టు నివేదికలు చెప్తున్నాయి. ఈ ఉద్గారాల కారణంగా వాతావరణ మార్పులు జరిగి ధ్రువప్రాంతాల్లో మంచు కరిగి, సముద్ర జలాలు వేడెక్కి జీవావరణానికే ముప్పు వాటిల్లే దుస్థితి దాపురించింది. ఈ క్రమంలోనే విమానాల స్థానంలో ముఖ్యంగా కార్గో విమానాలకు ప్రత్యామ్నాయంగా ఎయిర్‌షిప్‌లను తీసుకురావాలని శాస్త్రవేత్తలు కసరత్తు ప్రారంభించారు.

**సవాళ్లూ లేకపోలేదు**

ఎయిర్‌షిప్‌ల వాడకంలో కొన్ని సవాళ్లు ఎదురవుతున్నాయి. అందులో మొదటిది వీటిలో ఇంధనంగా వాడే హీలియం లభ్యత. భూమిపై హీలియం లభ్యత తక్కువగా ఉన్నది. 1 కిలో సరుకును మోయడానికి 1 క్యూబిక్ మీటర్ హీలియం అవసరమవుతుంది. దీనికి రూ. 3 వేల వరకూ వెచ్చించాల్సి రావొచ్చు. ఇది ఖర్చుతో కూడుకొన్న వ్యవహారం. ఇక మరో ప్రధాన సమస్య.. సరుకు రవాణా జరిగేప్పుడు ఎలాంటి అవాంతరాలు కలుగనప్పటికీ, సరుకును ఎయిర్‌షిప్‌లోకి ఎక్కించడం, దించడం సమయంలో సదరు వాహకనౌక బరువును సమతుల్యంతో (బ్యాలెన్స్‌డ్‌గా) నిలపగలగాలి. లేకపోతే అది కూలిపోయే ప్రమాదం ఉన్నది. వేగం కూడా ఇంకో సమస్యగా మారింది. అయితే, వీటికి తగిన పరిష్కారాలను కనుగొనే పనిలో ఉన్నట్టు పలువురు నిపుణులు చెప్తున్నారు.

**నిషేధం అలా..**

1937 మే 6న అమెరికాలో 'హిండెన్‌బర్గ్ ఎయిర్‌షిప్ ప్రమాదం' జరిగింది. ఈ ఘటనలో 36 మంది మరణించారు. హైడ్రోజన్ గ్యాస్ లీకవ్వడం, అప్పుడే ఎలక్ట్రోస్టాటిక్ డిశ్చార్జీ సిస్టమ్‌లో చిన్న నిప్పురవ్వలు ఏర్పడటంతో ఈ ప్రమాదం జరిగింది. ఈ దుర్ఘటన జరిగిన తర్వాత ఎయిర్‌షిప్‌ల వినియోగాన్ని పెద్దమొత్తంలో తగ్గించారు. అలాగే విమానాలతో పోలిస్తే వేగంలో ఎయిర్‌షిప్‌లు వెనుకబడటంతో క్రమంగా ఇవి కనుమరుగయ్యాయి.

## రేసులో కంపెనీలు

**సరికొత్త ఎయిర్‌షిప్‌ల తయారీకి ఇప్పటికే పలు కంపెనీలు సిద్ధమయ్యాయి. ఫ్రాన్స్‌కు చెందిన ఫ్లయింగ్ వేల్స్ అనే కంపెనీ ఫ్లయింగ్ క్రేన్ పేరిట 200 మీటర్ల పొడువున్న ఎల్‌సీఏ60టీ హీలియమ్ ఎయిర్‌షిప్‌ను ఇప్పటికే అందుబాటులోకి తీసుకొచ్చింది. రాకెట్ విడి భాగాలు, పవర్‌లైన్ టవర్లు, టర్బైన్ బ్లేడ్లు, ఏజెన్సీ ఏరియాలకు తాత్కాలిక దవాఖాన భవనాలు, కర్మాగారాలకు అడవుల నుంచి కలప తదితర రవాణాకు దీన్ని వినియోగిస్తున్నారు. ఏరోస్ అనే మరో కంపెనీ కూడా ఈ తరహా ఎయిర్‌షిప్‌నే అందుబాటులోకి తీసుకొచ్చింది.**

# వారంలోనే రెండింతలు..

## మరింత ఘాటెక్కిన ఉల్లి



**మహా, న్యూఢిల్లీ:** దేశంలో ఉల్లి ఘాటు మరింత పెరిగింది. నిన్న మొన్నటి వరకు హోల్‌సేల్ మార్కెట్లలో రూ.4060 పలికిన కిలో ఉల్లిపాయల ధర.. ఇప్పుడు రూ.7080కి చేరింది. శుక్రవారం కొన్ని ప్రాంతాల్లో రూ.80 కంటే అధిక ధర పలికింది. దీంతో కుటుంబ బడ్జెట్లు తల్లకిందులై వినియోగదారులు అల్లాడుతున్నారు. ద్రవ్యోల్బణంతోపాటు ఉల్లి కొనుగోలు ధరలు పెరగడమే ఇందుకు కారణమని వ్యాపారులు చెప్తున్నారు. మండీల్లో కిలో ఉల్లి ధర రూ.60 నుంచి రూ.70కి పెరిగిందని, అమ్మకాలపై ప్రభావం చూపుతుండటంతో విక్రయాలు తగ్గాయని, అయినప్పటికీ రోజువారీ ఆహారంలో ఎంతో కీలకపాత్ర పోషిస్తున్న ఉల్లిపాయలను జనం కొంటూనే ఉన్నారని ఢిల్లీ మార్కెట్‌లోని ఓ వ్యాపారి తెలిపారు. ధరల పెరుగుదలపై వినియోగదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉల్లితోపాటు వెల్లుల్లి ధర కూడా రెట్టింపు కావడంతో కుటుంబ బడ్జెట్‌ను దెబ్బ తీస్తున్నదని కొనుగోలుదారులు వాపోతున్నారు.

# పరారీలో తమిళ నటి కస్తూరి..

## ఫోన్ స్విచ్ఛాఫ్.. ఇంటికి తాళం..!

**మహా, చెన్నై:** తెలుగు వారిని కించపరిచే వ్యాఖ్యలు చేసిన తమిళ నటి కస్తూరి పరారీలో ఉన్నారు. ఆమె ఫోన్ కూడా స్విచ్ఛాఫ్ చేసి ఉంది. ఇంటికి తాళం వేసింది. దాంతో ఈ కేసులో కస్తూరికి సమన్‌లు ఇవ్వడం పోలీసులకు కష్టంగా మారింది. కొద్ది రోజుల క్రితం నటి కస్తూరి తెలుగువారిపై చేసిన వ్యాఖ్యలు వివాదాస్పదమయ్యాయి. ఓ రాజకీయ సభలో ఆమె తెలుగు వారిని కించపరుస్తూ మాట్లాడారు. ఆమె వ్యాఖ్యలపై తెలుగు సంఘాలు మండిపడ్డాయి.

దాంతో ఆమె తన తప్పును సరిదిద్దుకునే ప్రయత్నం చేశారు. తాను తెలుగు వారిని కించపరిచే ఉద్దేశంతో ఆ వ్యాఖ్యలు చేయలేదని ప్రకటించారు. అయినా ఫలితం లేకుండా పోయింది. మూడు రోజుల క్రితం కస్తూరిపై చెన్నైలో ఇదే విషయమై కేసులు నమోదయ్యాయి. ఈ మేరకు ఆమెకు సమన్‌లు అందజేసేందుకు పోలీసులు ఇంటికి వెళ్లారు. ఇంటికి తాళం వేసి ఉండటంతో ఫోన్ చేశారు. ఫోన్ కూడా స్విచ్ఛాఫ్ వచ్చింది. దాంతో నటి కస్తూరి పారిపోయారన్న ప్రచారం జరుగుతోంది. ప్రస్తుతం ఆమె ఎక్కడుందనే విషయంలో స్పష్టమైన సమాచారం లేదు. అన్నమయ్య సినిమాతో తెలుగు ప్రేక్షకులకు పరిచయమైన కస్తూరి ఆ తర్వాత పలు సినిమాల్లో నటించారు. ఓ తెలుగు సీరియల్‌లోనూ లీడ్ రోల్ పోషించి మంచి గుర్తింపు పొందారు. అందుకే తెలుగులో అవకాశాలు పొందుతూ తెలుగు వారిపై అనుచిత వ్యాఖ్యలు చేయడమేంటని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇటీవల నటి కస్తూరీ ఓ రాజకీయ సభలో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆమె.. 'తమిళనాడులో అంతఃపుర మహిళలకు సేవ చేసేందుకు తెలుగువారు వచ్చేవారు' అని వ్యాఖ్యానించారు. ఈ వ్యాఖ్యలు తీవ్ర దుమారం రేపాయి.





## చాంపియన్స్ ట్రోఫీ ఈవెంట్ రద్దు

**ఐసీసీ కీలక నిర్ణయానికి కారణమిదే..!**

వచ్చే ఏడాది పాకిస్థాన్ వేదికగా చాంపియన్స్ ట్రోఫీపై నెలకొన్న అనిశ్చితిలో మరో మలుపు. ఈ మెగా టోర్నీ కోసం పాకిస్థాన్‌కు వెళ్లేది లేదని బీసీసీఐ తేల్చేయగా.. హైబ్రిడ్ మోడల్‌కు అవకాశముందనే వార్తలు వినిపిస్తున్నాయి. అంతేకాదు టీమిండియా మ్యాచ్‌లకు దుబాయ్ వేదిక కానుందనే వార్తలు వైరల్ అయ్యాయి. ఈ నేపథ్యంలో అంతర్జాతీయ క్రికెట్ మండలి కీలక నిర్ణయం తీసుకుంది. నవంబర్ 11వ తేదీన జరగాల్సిన చాంపియన్స్ ట్రోఫీ ఈవెంట్‌ను రద్దు చేసింది. 'చాంపియన్స్ ట్రోఫీ షెడ్యూల్ ఇంకా ఖరారు కాలేదు. ఆతిథ్య దేశంతో పాటు ఈ టోర్నీలో పాల్గొనే ఇతర దేశాల బోర్డులతోనూ మేము చర్చలు జరుపుతున్నాం. షెడ్యూల్‌పై స్పష్టత వచ్చాక మేము అధికారికంగా వెల్లడిస్తాం' అని ఐసీసీ ఓ ప్రకటనలో తెలిపింది. దాంతో, చాంపియన్స్ ట్రోఫీలో టీమిండియా మ్యాచ్‌ల వేదకను నిర్ణయించాకే షెడ్యూల్ విడుదల చేయడం ఖాయమనిపిస్తోంది. షెడ్యూల్ ప్రకారం వచ్చే ఏడాది చాంపియన్స్ ట్రోఫీ పాకిస్థాన్‌లోనే జరగాలి. ఫిబ్రవరి 19 నుంచి మార్చి 19 వరకూ సాగే టోర్నీ కోసం ఆ దేశ క్రికెట్ బోర్డు అన్ని ఏర్పాట్లు చేస్తోంది. కానీ, భద్రత కారణాల రీత్యా భారత జట్టును పాక్‌కు పంపేందుకు బీసీసీఐ ససేమిరా అంటోంది. ఈ పరిస్థితుల్లో తటస్థ వేదికపై టీమిండియా మ్యాచ్‌ల నిర్వహించడం తప్ప మరో దారి కనిపించడం లేదు. అయితే.. హైబ్రిడ్ మోడల్‌కు తాము అంగీకరించబోమని పాకిస్థాన్ క్రికెట్ బోర్డు అధ్యక్షుడు మొహ్సిన్ నఖ్వీ స్పందించాడు.

## చిన్న వయసులోనే డబ్ల్యూటీఏ ట్రోఫీ..

అమెరికా టెన్నిస్ సంచలనం కొకో గాఫ్ మరోసారి చరిత్ర సృష్టించింది. చిన్నవయసులోనే డబ్ల్యూటీఏ ఫైనల్స్ చాంపియన్‌గా అవతరించింది. ఈ టోర్నీలో ప్రపంచ స్థాయి క్రీడాకారిణులను ఓడించిన గాఫ్ టైటిల్ పోరులోనూ సత్తా చాటింది. ఆద్యంతం ఉత్కంఠ రేపిన మారథాన్ మ్యాచ్‌లో చైనాకు చెందిన జెంగ్ క్విన్‌వెన్‌ను చిత్తు చేసింది. ట్రోఫీతో పాటు రూ.40 కోట్ల ప్రైజ్‌మనీ కొల్లగొట్టింది ఈ అమెరికా టీనేజర్. డబ్ల్యూటీఏ ఫైనల్స్‌లో అరినా సబలెంక, ఇగా స్వియాటెక్ వంటి దిగ్గజాలను ఓడించి ఫైనల్ చేరిన అమెరికా యువ కెరటం ఫైనల్లోనూ రఫ్ఫాడించింది. తొలి సెట్ కోల్పోయిన గాఫ్ అనూహ్యంగా పుంజుకొని క్విన్‌వెన్‌కు చెక్ పెట్టింది. వరుసగా రెండు సెట్లతో జోరు చూపించి చివరకు 3-6, 6-4, 7-4తో టైటిల్‌ను కైవసం చేసుకుంది. దాంతో, 20 ఏండ్ల వయసులోనే డబ్ల్యూటీఏ ఫైనల్స్‌లో గెలుపొంది చాంపియన్‌గా నిలిచిన తొలి మహిళా ప్లేయర్‌గా గాఫ్ అరుదైన రికార్డు తన పేరిట రాసుకుంది. లెజెండరీ ప్లేయర్ సెరెనా విలియమ్స్ తర్వాత ఈ ఘతన సాధించిన రెండో అమెరికన్‌గా గాఫ్ చరిత్ర పుటల్లో నిలిచింది. 2013లో సెరెనా డబ్ల్యూటీఏ ఫైనల్స్ చాంపియన్‌గా రికార్డు లిఖించింది. 'నా అత్యుత్తమ ఆట ఆడాలని, ఎట్టిపరిస్థితుల్లోనే ఆశ కోల్పోవద్దని నిర్ణయించుకున్నా. ఈరోజు నేను అద్భుతంగా ఆడాను. అయితే.. ఫైనల్స్‌కు ముందు నేను దారుణంగా ఓడిపోతాననే వార్తలు విన్నాను. ఆ మాటలకు నేను బాధ పడలేదు. అవునా చూద్దాం అని అనుకున్నా. ఒక విషయం నిజాయతీగా చెబుతున్నా.. నా గురించి అలా మాట్లాడిన మనుషుల ఆలోచన తప్పు అని నిరూపించేందుకు ఈ విజయమే సాక్ష్యం. నేను కాదు నా రాకెట్ మాట్లాడుతుంది. ఈ విజయాన్ని మోటివేషన్‌గా తీసుకుంటా' అని గాఫ్ మ్యాచ్ అనంతరం భావోద్వేగంతో మాట్లాడింది.





## న్యూజిలాండ్ భారీ షాక్

**ఈసారి మళ్లీ లంక చేతిలోనే**

భారత జట్టును వైట్‌వాష్ చేసిన న్యూజిలాండ్ జట్టుకు ఘోర పరాభవం ఎదురైంది. టీమిండియాపై తిరుగులేని ఆధిపత్యం చెలాయించి సిరీస్ పట్టేసిన కివీస్ జైత్రయాత్రకు తెరపడింది. మళ్లీ శ్రీలంక చేతిలోనే ఓడిపోవడం గమనార్హం. శనివారం జరిగిన తొలి టీ20లో లంక స్పిన్నర్ల ధాటికి న్యూజిలాండ్ కుప్పకూలింది. స్వల్ప ఛేదనలో అదరగొట్టిన చరిత అసలంక బృందం సిరీస్‌లో 10తో ఆధిక్యంలోకి దూసుకెళ్లింది. వారం రోజుల వ్యవధిలోనే న్యూజిలాండ్ ఆట మారింది. భారత గడ్డపై 12 ఏండ్ల రికార్డును బ్రేక్ చేస్తూ టెస్టు సిరీస్ గెలుపొందిన ఆ జట్టు పొట్టి పోరులో తడబడింది. దంబుల్లా స్టేడియంలో శ్రీలంక స్పిన్నర్లకు తలొగ్గింది. దునిత్ వెల్లలాగే(3/20) వనిందు హసరంగ(2/20)లు తిప్పేయగా కివీస్ 135 పరుగులకే ఆలౌటయ్యింది. ఆల్‌రౌండర్ మైకేల్ బ్రాస్‌వెల్(27), జాకరీ ఫల్క్‌స్(27)లు మాత్రమే పర్వాలేదనిపించారు. అనంతరం ఇన్నింగ్స్ ఆరంభించిన లంక 4 వికెట్ల తేడాతో జయభేరి మోగించింది. ఓపెనర్లు పథుమ్ నిశాంక(19), కుశాల్ మెండిస్(0)లు విఫలైమనా కుశాల్ పెరీరా(23), కుశాల్ మెండిస్(23)లు దంచారు. కివీస్ బౌలర్లను సమర్థంగా ఎదుర్కొంటూ ఈ ఇద్దరూ స్కోర్ బోర్డును ఉరికించారు. వీళ్లు ఔటయ్యాక కెప్టెన్ చరిత అసలంక(35 నాటౌట్), వనిందు హసరంగ(22)లు కీలక భాగస్వామ్యం నెలకొల్పి జట్టును విజయం వైపు నడిపించారు. హసరంగ తర్వాత దునిత్ వెల్లలాగే(11 నాటౌట్) సాయంతో అసలంక జట్టును గెలిపించాడు.

**తెలంగాణ ప్రీమియర్ గోల్ఫ్ లీగ్..**

## టాప్‌లో ఆటమ్ చార్జర్స్

తెలంగాణ ప్రీమియర్ గోల్ఫ్ లీగ్‌లో 16 జట్ల మధ్య పోరు హోరాహోరీగా సాగుతున్నది. హైదరాబాద్ గోల్ఫ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరుగుతున్న టోర్నీలో శనివారం 3వ రౌండ్ ముగిసే సరికి ఆటమ్ చార్జర్స్ 532 పాయింట్లతో ఓవరాల్‌గా అగ్రస్థానంలో కొనసాగుతున్నది. టీమ్ దాసోస్(521), వ్యాలీ వారియర్స్(519) వరుసగా రెండు, మూడు స్థానాల్లో ఉన్నాయి. మూడో రౌండ్‌లో ఎమ్‌వైకే స్ట్రైకర్స్ అగ్రస్థానం దక్కించుకుంది.





# సినిమా వార్తలు MOVIE NEWS



## స్పిరిట్ మూవీ బిగ్ అప్‌డేట్.. ప్రభాస్‌పై కొరియన్ స్టార్ డాన్ లీ పోస్ట్



పాన్ ఇండియా స్టార్ ప్రభాస్, యానిమల్ దర్శకుడు సందీప్‌రెడ్డి వంగా కాంబోలో 'స్పిరిట్' అనే సినిమా తెరకెక్కనున్న విషయం తెలిసిందే. సుమారు రూ. 300 కోట్ల బడ్జెట్‌తో రానున్న ఈ మూవీని టీ సిరీస్, భద్రకాళి పిక్చర్స్ నిర్మించనున్నారు. ప్రస్తుతం ప్రీ ప్రొడక్షన్ పనులు జరుపుకుంటున్న ఈ చిత్రం నుంచి అప్‌డేట్స్ కోసం ప్రభాస్ అభిమానులంతా కళ్ళు కాయలు కాచేలా ఎదురుచూస్తున్నారు. అయితే ఈ మూవీకి సంబంధించి ఒక క్రేజీ అప్‌డేట్ సోషల్ మీడియాలో వైరల్ అవుతుంది. ఈ పాన్ వరల్డ్ సినిమాలో విలన్‌గా కొరియాకు చెందిన హాలీవుడ్ స్టార్ హీరో డాన్ లీ(లీ డాంగ్ సిక్)ని తీసుకుబోతున్నట్లు తెలుస్తుంది. దీనికి సంబంధించి తాజాగా ఆయన ఇన్‌స్టాలో ప్రభాస్ ఫొటోని షేర్ చేశాడు. దీంతో స్పిరిట్ మూవీలో డాన్‌లీ కన్‌ఫర్మ్ అయినట్లు తెలుస్తుంది. ట్రైన్ టూ బూసాన్, మార్వెల్ సిరీస్, ఎటర్నల్ సినిమాల ద్వారా ఈ సౌత్ కొరియన్ యాక్టర్ ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు తెచ్చుకున్నారు. అయితే స్పిరిట్‌లో డాన్ లీ ఎంపిక అయినట్లు ఇప్పటికే వార్తలు వస్తున్నాయి. కాగా దీనికి సంబంధించి అధికారిక ప్రకటన రావాల్సి ఉంది. ఈ సినిమా కథ ఇంటర్నేషనల్ స్థాయిలో ఉంటుందట. అందుకే హాలీవుడ్ నటులపై దృష్టిసారించారు సందీప్‌రెడ్డి వంగా. ఇందులో ప్రభాస్ పవర్‌ఫుల్ పోలీస్‌ఆఫీసర్‌గా కనిపిస్తారని గతంలో సందీప్‌రెడ్డి చెప్పారు. ప్రస్తుతం స్క్రిప్ట్ వర్క్ జరుపుకుంటున్న ఈ సినిమా ఈ ఏడాది చివర్లో సెట్స్‌కి వెళ్లే అవకాశం ఉంది.



## క సినిమా చూసి కిరణ్ అబ్బవరంను ప్రశంసించిన చిరంజీవి



**మహా, సినిమా:**

టాలీవుడ్ అగ్ర కథానాయకుడు మెగా స్టార్ చిరంజీవి ఏదైన సినిమా చూసిన అనంతరం తనకు నచ్చితే ఆ సినిమాను ప్రశంసిస్తూ పోస్ట్ పెట్టడమో లేదా.. మూవీ టీంను తన ఇంటికి పిలిపించుకొని అభినందించడం చేస్తూ ఉంటాడు అన్న విషయం తెలిసిందే. నిన్నటికి నిన్న 'లక్కీ భాస్కర్' సినిమా చూసి దర్శకుడు వెంకీ అట్లూరిని అభినందించిన చిరు తాజాగా 'క' సినిమా చూసి నటుడు కిరణ్ అబ్బవరంతో పాటు 'క' మూవీ టీం అందరిని ప్రత్యేకంగా అభినందించాడు. చిన్న సినిమాగా వచ్చి బాక్సాఫీస్ వద్ద సూపర్ హిట్ అందుకుంది క చిత్రం. టాలీవుడ్ యువ నటుడు కిరణ్ అబ్బవరం ప్రధాన పాత్రలో నటించిన ఈ సినిమాకు సుజీత్, సందీప్ ఇద్దరు దర్శకులు సంయుక్తంగా దర్శకత్వం వహించగా.. కిరణ్ అబ్బవరం సోంత బ్యానర్‌పై వస్తున్న ఈ సినిమాను చింతా గోపాలకృష్ణరెడ్డి భారీ బడ్జెట్‌తో నిర్మించారు. నయన్ సారిక కథానాయికగా నటించింది. దీపావళి కానుకగా అక్టోబర్ 31న ప్రేక్షకుల ముందుకు వచ్చిన ఈ చిత్రం పాజిటివ్ టాక్‌తో దూసుకుపోతుంది. తొలిరోజే రూ.6 కోట్ల వసూళ్లను రాబట్టిన ఈ చిత్రం వారం రోజుల్లో రూ.50 కోట్లకు పైగా వసూళ్లను రాబట్టినట్లు చిత్రబృందం తెలిపింది. కిరణ్ అబ్బవరంకు కూడా చాలా రోజుల తర్వాత హిట్ పడడంతో మూవీని చూడడానికి ప్రేక్షకులు థియేటర్లకు క్యూ కడుతున్నారు. ఇక ఇదే సినిమాను తాజాగా చూసిన మెగాస్టార్ చిరంజీవి మూవీ టీంని ఇంటికి ఇన్‌వైట్ చేసి ప్రత్యేకంగా అభినందించారు. కాగా ఇందుకు సంబంధించిన ఫొటోలు వైరల్‌గా మారాయి.

## కిస్సిక్ అంటూ కిర్రెక్కిస్తానంటున్న శ్రీలీల

'పుష్ప' సినిమాలో 'ఊ అంటావా మావ..' పాట ఎంతటి హిట్ అయ్యిందో తెలిసిందే. ఒక్క పాటతో హీరోయిన్ స్థాయి క్రెడిబులిటీని కొట్టేసింది అందాల సమంత. త్వరలో 'పుష్ప 2' రాబోతున్నది. ఆనవాయితీ ప్రకారం తొలి పార్ట్‌లో ఉన్నట్టే ఈ మలి పార్ట్‌లోనూ ఓ ఐటమ్ నంబర్‌ని ఆడియన్స్ ఎక్స్‌పెక్ట్ చెయ్యడం కామన్. దాన్నిగ్రహించే 'పుష్ప 2'లో కూడా అదిరిపోయే ఐటమ్ సాంగ్‌ని ప్లాన్ చేశారు దర్శకుడు సుకుమార్. మరి ఈ సారి బన్నీతో అడుగు కలిపే తార ఎవరు? అనే విషయంపై ఇన్నాళ్లూ అటు మీడియాలో, ఇటు పరిశ్రమలో తర్జనభర్జనలు జరిగాయి. ఎట్టకేలకు ఈ పాటలో శ్రీలీల కనిపించనున్నట్టు తేటతెల్లమైపోయింది. రీసెంట్‌గా 'పుష్ప2' సెట్‌లో అల్లు అర్జున్, శ్రీలీల ఉన్న ఫొటో ఒకటి సోషల్ మీడియాలో లీక్ అయ్యింది. దాంతో మైత్రీ మూవీమేకర్స్ వారు అధికారికంగా ఆ పాట వివరాలను శనివారం ఎక్స్(ట్విటర్) ద్వా రా తెలియజేశారు. ఇందులో 'కిస్సిక్..' అంటూ సాగే ఐటమ్ సాంగ్ హైలైట్‌గా నిలుస్తుందని వారు ఈ పోస్ట్‌లో వెల్లడించారు. గతంలో 'ఆహా' ఓటీటీకి సంబంధించిన ప్రకటనలో బన్నీ, శ్రీలీల కలిసి నటించారు. ఇప్పుడు 'పుష్ప2' కోసం మరోసారి ఇద్దరూ కలిసి నర్తించనున్నారు. ఇది బన్నీ ఫ్యాన్స్‌కు నిజం గా శుభవార్తే.